E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com



ప్రభుత్వ స్కూళ్లలో ప్రీ ప్రైమరీ » 3లో

(తేదీ) 12 -06-2025 (వారం) గురువారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com

'తత్కాల్' కొత్త రూల్: ఆధార్ ఓటీపీ ఉంటేనే ట్రైన్ టికెట్లు! » 4లో



సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీలో విదేశీ మద్యం, గంజాయి » 3లో



పౌడర్ వేసుకు స్నానని.. తిట్టారు » 5లో



భారత కెప్టెన్ ఒక సూపర్ స్టార్.. కానీ అతడిని మిస్ అవుతారు: ఓలీ పోప్ » 5లో



# ప్రభుత్వ ఆమోదంతోనే కాళేశ్వరం పనులు



- కాళేశ్వరం నిర్మాణంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు మాజీ సీఎం కేసీఆర్ స్పష్టీకరణ
- సాంకేతిక అంశాలపై ఇంజనీర్లు, నిపుణులు నిర్ణయాలు తీసుకున్నారు
- 152 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహట్టి బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర అంగీకరించలేదు
- అక్కడ నీటి లభ్యత సైతం లేదని సీడబ్ల్యూసీ తేల్చింది
- బరాజ్‌ల లొకేషన్ల ఎంపిక, వాటిలో నీటి నిల్వలపై ఇంజనీర్లే నిర్ణయం తీసుకున్నారని వెల్లడి
- కేసీఆర్ విజ్ఞప్తి మేరకు ఇన్‌కెమెరా క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించిన కమిషన్
- తుమ్మిడిహట్టికి బదులుగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు నిర్మించాలని వ్యాప్కోస్ సూచించింది.... ఈ నేపథ్యంలోనే 'ప్రాణహిత–చేవెళ్ల' రీఇంజనీరింగ్ చేపట్టాం

ఈ కబురు, హైదరాబాద్: 'కాళేశ్వరం ఎత్తిపోతల పథకం భారీ ప్రాజెక్టు. దీనికి సంబంధించిన నిర్ణయాలన్నీ రాష్ట్ర మంత్రివర్గ ఆమోదంతోనే తీసుకున్నాం. సాంకేతికపరమైన అంశాలపై ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు నిర్ణయాలు తీసుకున్నారు. కాళేశ్వరం కట్టాలని తొలుత రాజకీయ నిర్ణయం మేమే (ప్రభుత్వం) తీసుకున్నాం. తుమ్మిడిహట్టికి బదులుగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు నిర్మించాలని అంతర్జాతీయ ఖ్యాతి గడించిన కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ సూచించింది..' అని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్.. బుధవారం బీఆర్‌కేఆర్ భవన్‌లోని కార్యాలయంలో నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఆయన 115వ సాక్షిగా పాల్గొన్నారు. కమిషన్ అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

తరువాయి 2లో



కేసీఆర్ కుటుంబానికి కాంగ్రెస్‌లోకి ప్రవేశం లేదు

# కేసీఆర్.. కిషన్‌రెడ్డి ఒక్కటే

- అందుకే తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారు
- కాళేశ్వరం నిబంధనల ప్రకారమే జరిగిందన్న ఈటల.. దాన్నే సమర్థించిన కిషన్‌రెడ్డి
- మోదీ, అమిత్‌షా మాటలకు భిన్నమైన ఈ ధోరణి దేనికి సంకేతం?
- ఆ ప్రాజెక్టుపై రెండుమూడు రోజుల్లో అన్ని విషయాలూ చెబుతా
- అధిష్ఠానంతో చర్చ మంత్రివర్గ శాఖలపై కాదు.. కర్ణాటకలో కులగణనపైనే..
- ఢిల్లీలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఈ కబురు:కేసీఆర్, కేటీఆర్, కిషన్‌రెడ్డిల ఆలోచన ఒకటే తీరుగా ఉందని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టులను వారు అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం విషయంలో విచారణ కమిషన్ ఎదుట ఈటల ఇచ్చిన వాంగ్మూలం.. కేసీఆర్ వాదనలకు అనుగుణంగానే ఉందని, దాన్నే కిషన్‌రెడ్డి కూడా సమర్థించడంలో ఆంతర్యమేమిటని సీఎం ప్రశ్నించారు. తాను ఉన్నంతవరకు.. కేసీఆర్ కుటుంబంలో ఎవరినీ కాంగ్రెస్‌లోకి రానివ్వబోనని స్పష్టం చేశారు. ఢిల్లీకొచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో మాట్లాడిన అనంతరం హైదరాబాద్‌కు పయనమయ్యే ముందు బుధవారం మధ్యాహ్నం తన అధికార నివాసంలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

తరువాయి 2లో

# 10 వేల మందికి శిక్షణ



- స్ప్రింగ్ సెమీ కండక్టర్స్ అంగీకారం
- మంత్రి శ్రీధర్‌బాబుతో దిగ్గజ కంపెనీల ప్రతినిధుల భేటీ
- సెమీ కండక్టర్స్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రపంచంలోనే తెలంగాణను నైపుణ్య రాజధానిగా మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు.**

ఈ కబురు, హైదరాబాద్: ప్రపంచంలోనే తెలంగాణను నైపుణ్య రాజధానిగా మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్న యూకేకు చెందిన సెమీ కండక్టర్ దిగ్గజ సంస్థ ఆర్మ్ హోల్డింగ్స్ సంస్థ ప్రతినిధులతో ఆయన బుధవారం డా.బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో భేటీ అయ్యారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనుకూలతలు, పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ఈ సందర్భంగా వివరించారు. "సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్‌లో దిగ్గజ సంస్థగా ఉన్న ఆర్మ్ హోల్డింగ్స్.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించడం మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. తెలంగాణ రైజింగ్‌లో భాగమయ్యేందుకు ముందుకొచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు. పరిశ్రమ ఏర్పాటులో అన్ని రకాలుగా అండగా ఉంటాం. మాకున్న పెద్ద ఆస్తి యువత. వారిలో ప్రతిభకు కొదువ లేదు. కొంచెం సానబెడితే మెరికల్లా తయారవుతారు.

తరువాయి 2లో

# ఓఎంసీ కేసు.. గాలి జనార్దనరెడ్డికి బెయిల్

*ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో నలుగురు దోషులకు తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.*



హైదరాబాద్: ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో నలుగురు దోషులకు తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. గాలి జనార్దనరెడ్డితో పాటు, ఆయన పీఏ అలీఖాన్, బీవీ శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్‌కు బెయిల్ ఇచ్చింది. ఈ నలుగురికి నాంపల్లి సీబీఐ కోర్టు విధించిన ఏడేళ్ల జైలు శిక్షను సస్పెండ్ చేసింది. దేశం విడిచి వెళ్లరాదని, రూ.10 లక్షలు సొంత పూచీకత్తు సమర్పించాలని షరతు విధించింది.

తరువాయి 2లో

# తెలంగాణ కొత్త మంత్రుల శాఖలు ఇవే



ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణ కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుపై ఉత్కంఠకు తెరపడింది. ముగ్గురు కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు జరిగింది. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

గడ్డం వివేక్- కార్మిక, మైనింగ్ శాఖలు

వాకిటి శ్రీహరి- పశుసంవర్ధక, స్పోర్ట్ అండ్ యూత్ శాఖలు

అడ్లూరి లక్ష్మణ్- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ

తరువాయి 2లో

# వానలకు అనుకూలంగా వాతావరణం



ఈ కబురు, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు క్రమంగా ఊపందుకునే సూచనలు కన్పిస్తున్నాయి. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వేసవి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి చల్లదనం సంతరించుకుంటోంది. ఈ క్రమంలో ప్రస్తుతం రుతుపవనాల కదలికలు ఆశాజనకంగా ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. వాస్తవానికి రుతుపవనాలు వచ్చినప్పటికీ గత పది రోజులుగా మందగించడంతో వానల జాడ లేకుండా పోయింది. అక్కడక్కడా అడపాదడపా తేలికపాటి వర్షాలు నమోదైనప్పటికీ..వాతావరణంలో నెలకొన్న మార్పులతో అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత తీవ్ర ఉక్కిరిబిక్కిరికి గురిచేశాయి. కానీ ప్రస్తుతం పరిస్థితి మారుతోంది. రుతుపవనాల కదలికలు చురుగ్గా మారుతుండటంతో పాటు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీంతో రానున్న మూడు రోజులు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు tకురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. వికారాబాద్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, ఇతర జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

**మాటూర్‌లో 4.93 సెం.మీ. వర్షం**

బుధవారం రాష్ట్రంలో సగటున 7.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ సీజన్‌లో 11 రోజుల్లో 3.37 సెంటీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. బుధవారం సాయంత్రానికి 2.35 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా నల్లగొండ జిల్లా మాటూర్‌లో 4.93 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లిలో 4.35, నల్లగొండ జిల్లా ముదిగొండలో 3.38, పదమటిపల్లెలో 3.10, తిమ్మాపూర్‌లో 3 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

**భారీగా తగ్గిన ఉష్ణోగ్రతలు**

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కంటే 5 డిగ్రీ సెల్సియస్ తక్కువగా నమోదయ్యాయి. ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. గరిష్ఠ ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 33.8 డిగ్రీ సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రత మెదక్‌లో 20 డిగ్రీ సెల్సియస్ నమోదైంది. రానున్న మూడు రోజులు కూడా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

# దాటవేత ధోరణిలో సమాధానం



- ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును రెండోసారి విచారించిన సిట్
- ప్రణీత్‌రావుతో కలిపి ప్రశ్నలు అడిగిన అధికారులు..
- ఎస్ఐబీలో అనేక ఆపరేషన్లు జరుగుతాయన్న మాజీ చీఫ్
- 14న మళ్లీ విచారణకు రావాలని నోటీసు

*ఈ కబురు, హైదరాబాద్: ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావును సిట్ అధికారులు మరోసారి ప్రశ్నించారు. ఈయన్ను సోమవారం ఉదయం 11.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ప్రశ్నించిన విషయం తెలిసిందే. [illegible] ఎనిమిదిన్నర గంటలపాటు విచారించారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ రెండో అంతస్తులో ఉన్న సిట్ కార్యాలయంలో వెస్ట్‌జోన్ డీసీపీ ఎస్‌ఎం విజయ్‌కుమార్, సిట్ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఏసీపీ పి.వెంకటగిరి నేతృత్వంలోని బృందం ప్రభాకర్‌రావును ప్రశ్నించింది.*

» 3లో

# లాస్ ఏంజెలెస్ 'యాంటీ ఐస్' కార్చిచ్చుకు కేంద్రంగా ఎందుకు..?

**ట్రంప్ విధానాలతో లాస్ ఏంజెలెస్‌లో అల్లర్లు చెలరేగటానికి బలమైన మూలాలు ఉన్నాయి. అక్కడి ప్రజల్లో చాలామంది విదేశీయులే కావడం దీనికో కారణం.**

ఈ కబురు;అమెరికాలో అత్యంత విలాసవంతమైన నగరాల్లో లాస్ ఏంజెలెస్ ఒకటి. ప్రపంచంలోనే శక్తిమంతమైన వ్యక్తులు, సంపన్నుల నివాసాలు ఇక్కడే ఉన్నాయి. అలాంటి నగరం ఇప్పుడు ట్రంప్ అత్యంత కఠినంగా చేపట్టిన అక్రమ వలసల వ్యతిరేక చర్యలకు కేంద్రంగా మారింది. ఈ నగరంలో విభిన్న జాతులు, దేశస్థులు అత్యధికంగా ఉండటమే దీనికి కారణం. దక్షిణ కాలిఫోర్నియాలో లాస్ ఏంజెలెస్ కౌంటీ ప్రధాన నగరంతో సహా 4,000 చదరపు మైళ్లలో విస్తరించింది. వీటిల్లో ధనికులు నివశించే బేవర్లీ హిల్స్, హాలీవుడ్, లాంగ్ బీచ్ మలిబు, పసాడెనా, సాంటా మొనాకో వంటి ప్రదేశాలున్నాయి. మొత్తంగా ఇక్కడ కోటి మంది జనాభా ఉంటారు. ఇది కాలిఫోర్నియా రాష్ట్రంలో 27 శాతానికి సమానం. అమెరికాలో 4.1 ట్రిలియన్ డాలర్లతో అత్యధిక జీడీపీ ఉన్న రాష్ట్రం ఇదే. ఇది మన దేశ జీడీపీ కంటే ఎక్కువ. లాస్ ఏంజెలెస్‌లోని మూడోవంతు మంది విదేశాల్లో జన్మించినవారే అని అమెరికా జనాభా లెక్కలు చెబుతున్నాయి.వలసదారుల ఆందోళనలకు కేంద్రంగా ఉన్న లాస్ ఏంజెలెస్ ప్రధాన నగరంలో 39 లక్షల మంది ప్రజలు ఉన్నారు. వీరిలో 35శాతం మంది అమెరికా బయట జన్మించినవారే. ఇక్కడ దాదాపు 9 లక్షల మంది వలసదారుల వద్ద ఎటువంటి పత్రాలు లేవు. దక్షిణ కాలిఫోర్నియా దోర్న్‌సిఫ్ విశ్వవిద్యాలయ పరిశోధన ప్రకారం వీరిలో చాలామంది దాదాపు 10 ఏళ్ల నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నారు. నగరంలోని ప్రతి ఐదింట ఒక ఇల్లు విభిన్న జాతులతో వైవిధ్యంగా ఉంటుంది. వారిలో కనీసం ఒకరు ఎటువంటి పత్రాలు లేకుండా అమెరికాలో ఉన్నవారు ఉంటారు.

ఇక యూఎస్ టుడే రిపోర్టు ప్రకారం విదేశాల్లో జన్మించి లాస్ ఏంజెలెస్‌లో ఉంటున్న వారిలో సగం మంది సహజసిద్ధమైన విధానాల్లో పౌరసత్వం పొందారు. ఈ కౌంటీలోని 18 లక్షల మంది హిస్పానిక్ లేదా లాటిన్ జాతులకు చెందినవారే. దాదాపు 50 లక్షల మంది ఆసియా వాసులు, హవాయ్ లేదా పసిఫిక్ దీవుల నుంచి వచ్చినవారు కూడా ఇక్కడ ఉంటున్నారు. ఈ నగరం మొత్తంలో 56 శాతం మంది ఇంగ్లిష్‌కాకుండా మరో భాషను కూడా ఇంట్లో మాట్లాడతారు.

తరువాయి 2లో



# కళ్లు బైర్లు కమ్మేలా.. వామ్మో కాళేశ్వరం

ఈఈ అక్రమాస్తులు ఇన్ని వందల కోట్లా



»3లో

మొదటి పేజీ తరువాయి

# ప్రభుత్వ ఆమోదంతోనే కాళేశ్వరం పనులు



తుమ్మిడిహట్టి వద్ద సాధ్యం కాకపోవడం వల్లే..
కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బరాజ్‌ల నిర్మాణంపై నిర్ణయం ఎవరిది అని కమిషన్ ప్రశ్నించగా, కేసీఆర్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. 'ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కింద తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణాన్ని నాటి మహారాష్ట్ర సీఎం పృథ్వీరాజ్ చవాన్ తీవ్రంగా వ్యతిరేకించారు. తర్వాత బీజేపీ అధికారంలోకి వచ్చాక సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌ను నేను స్వయంగా కలిసి 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణానికి సహకరించాలని కోరితే ససేమిరా అన్నారు. 148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే సహకరిస్తామన్నారు. ప్రాణహిత-చేవెళ్ల కింద 160 టీఎంసీలను తరలించాల్సి ఉండగా, తుమ్మిడిహట్టి వద్ద అంత నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం లేఖ రాసింది. ఈ పరిస్థితుల్లో తుమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణం సాధ్యం కాకపోవడం వల్లే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రీఇంజనీరింగ్ చేపట్టాం. ప్రత్యామ్నాయాలపై వ్యాప్కోస్ ఆధ్వర్యంలో లైడార్ సర్వే చేయించగా.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద మూడు బరాజ్‌లు నిర్మించాలని సిఫారసు చేసింది. బొగ్గు గనులు ఉండడంతో మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి నేరుగా నీళ్లను తరలించడం సాధ్యం కాదని తేల్చింది. అందుకే మూడు బరాజ్‌లు నిర్మించి ఎల్లంపల్లికి నీళ్లను ఎత్తిపోయాలనే నిర్ణయం జరిగింది. మేడిగడ్డ వద్ద 230 టీఎంసీల జలాల లభ్యత ఉందని వ్యాప్కోస్ తేల్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అన్ని రకాల అనుమతులను కేంద్రం నుంచి తీసుకున్నాం. బరాజ్‌ల నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం ఉంది. మంత్రివర్గ ఆమోదంతోనే ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని నిర్ణయాలు జరిగాయి..' అని కేసీఆర్ చెప్పారు.

ఆ నిర్ణయాలన్నీ ఇంజనీర్లవే...
బరాజ్‌ల లొకేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందా? అని కమిషన్ ప్రశ్నించగా.. ఇంజనీర్లు, సాంకేతిక బృందం తీసుకుందని కేసీఆర్ బదులిచ్చారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో 4 వేల మంది ఇంజనీర్లు పాల్గొన్నారు. బరాజ్‌ల నుంచి పంప్‌హౌస్‌ల ద్వారా నీళ్లను ఎత్తిపోసేందుకు అవసరమైన స్థాయిల్లో నిల్వలను కొనసాగించే అంశంపై ఇంజనీర్లే నిర్ణయం తీసుకున్నారు. సాంకేతిక అంశాల్లో నిర్ణయాలన్నీ ఇంజనీర్లే తీసుకున్నారు. మంత్రివర్గ ఆమోదంతో కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్) ఏర్పాటుకు అనుమతిచ్చాం. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కొరత ఉండడంతో రుణాల సమీకరణ కోసం దీనిని ఏర్పాటు చేశాం. ప్రాజెక్టుకు ఆదాయం సమకూరే వరకు రుణాల తిరిగి చెల్లింపు బాధ్యత ప్రభుత్వానిదే..' అని మాజీ సీఎం చెప్పారు. బరాజ్‌ల నిర్వహణకు రూ.280 కోట్ల నిధులిచ్చాం..కానీ మేడిగడ్డ బరాజ్ కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సీపేజీ ఏర్పడడం వెనక నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు సైతం ఉన్నట్టు వచ్చిన ఆరోపణలపై కేసీఆర్ స్పందించారు. బరాజ్‌ల నిర్వహణ, పర్యవేక్షణ కోసం రూ.280 కోట్లను కేటాయిస్తూ 2020లో తమ ప్రభుత్వం జారీ చేసిన జీవో 45 ప్రతిని కమిషన్‌కు అందజేశారు. నిధులు మంజూరు చేసినా ఇంజనీర్లు వాడుకోలేదని కేసీఆర్ చెప్పినట్టు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో నాణ్యత పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఓ క్వాలిటీ కంట్రోల్ డివిజన్‌నే ఏర్పాటు చేశామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన ఆరోపణలను తిప్పికొడుతూ రూపొందించిన ఓ పుస్తకాన్ని కూడా కమిషన్‌కు కేసీఆర్ అందజేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఇటీవల విలేకరుల సమావేశంలో ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌నే పుస్తక రూపంలోకి మార్చి కమిషన్‌కు ఇచ్చారు.

సిబ్బందిని, మీడియాను బయటకు పంపించి..
క్రాస్ ఎగ్జామినేషన్‌లో భాగంగా ఇప్పటివరకు హాజరైన ఇతర సాక్షులందరినీ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తమ కార్యాలయ అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధుల సమక్షంలో బహిరంగంగానే ప్రశ్నించింది. అయితే అనారోగ్య సమస్యల కారణంగా బహిరంగ విచారణలో పాల్గొనలేనని, తనను ప్రశ్నించేటప్పుడు ఎవరినీ అనుమతించరాదని కేసీఆర్ చేసిన విజ్ఞప్తిపై కమిషన్ సానుకూలంగా స్పందించింది. కోర్టు హాలు నుంచి అందరినీ బయటకు పంపించి 'ఇన్ కెమెరా' విధానంలో (కేవలం కేసీఆర్, కమిషన్ కార్యదర్శి మాత్రమే ఉన్నప్పుడు) క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది. జస్టిస్ ఘోష్ అడిగే ప్రశ్నలు, కేసీఆర్ ఇచ్చే సమాధానాలను కంప్యూటర్‌పై టైప్ చేసేందుకు కమిషన్ కార్యదర్శిని అనుమతించారు.

18 ప్రశ్నలు...50 నిమిషాలు
మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన విచారణ సుమారు 50 నిమిషాల పాటు సాగి 12.50 గంటలకు ముగిసింది. కేసీఆర్‌కు కమిషన్ 18 ప్రశ్నలు వేసినట్టు తెలిసింది. కేసీఆర్‌ను కమిషన్ కార్యాలయానికి తోడ్కొని వచ్చిన వారిలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సంతోష్ తదితరులు ఉన్నారు.

ముగిసిన క్రాస్ ఎగ్జామినేషన్
కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా జస్టిస్ ఘోష్ కమిషన్ చేపట్టిన క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. మేడిగడ్డ బరాజ్ 2023 అక్టోబర్ 21న కుంగిపోగా.. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సైతం లోపాలు బయటపడ్డాయి. ఈ మూడు బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై విచారణ కోసం 2024 మార్చి 14న సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్‌తో రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసింది. దీంతో నీటి పారుదల శాఖ ఇంజనీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, పలువురు ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లు, మాజీ మంత్రులకు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది. కమిషన్ గడువు వచ్చే నెలాఖరుతో ముగియనుండగా, ఆ లోగానే ప్రభుత్వానికి నివేదిక సమర్పించే అవకాశం ఉంది.

మొదటి పేజీ తరువాయి

### కేసీఆర్ కుటుంబానికి కాంగ్రెస్‌లోకి ప్రవేశం లేదు

# కేసీఆర్.. కిషన్‌రెడ్డి ఒక్కటే



ఈ కబురు:కేసీఆర్, కేటీఆర్, కిషన్‌రెడ్డిల ఆలోచన ఒకటే తీరుగా ఉందని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టులను వారు అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం విషయంలో విచారణ కమిషన్ ఎదుట ఈటల ఇచ్చిన వాంగ్మూలం.. కేసీఆర్ వాదనలకు అనుగుణంగానే ఉందని, దాన్నే కిషన్‌రెడ్డి కూడా సమర్థించడంలో ఆంతర్యమేమిటని సీఎం ప్రశ్నించారు. తాను ఉన్నంతవరకు.. కేసీఆర్ కుటుంబంలో ఎవరినీ కాంగ్రెస్‌లోకి రానివ్వబోనని స్పష్టం చేశారు. ఢిల్లీకొచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో మాట్లాడిన అనంతరం హైదరాబాద్‌కు పయనమయ్యే ముందు బుధవారం మధ్యాహ్నం తన అధికార నివాసంలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఢిల్లీలో పార్టీ పెద్దలతో గత రెండు రోజులుగా జరిగిన చర్చలు తెలంగాణలో మంత్రుల శాఖల కేటాయింపుపై కాదని, కర్ణాటకలో కులగణన అంశంపై మాత్రమేనని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ కులగణన నమూనాను కర్ణాటకలోనూ అమలు చేయాలని నిర్ణయించిన అధిష్ఠానం.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లతో పాటు తనను పిలిపించి చర్చిందన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో కొత్తగా చేరిన వారికి తన వద్ద ఉన్న శాఖలను కేటాయిస్తున్నట్లు చెప్పారు. పాత మంత్రులెవరైనా పనిభారం పెరిగిన కారణంగా తమ శాఖలను మార్చమని కోరితే తప్ప వాటి జోలికి పోమన్నారు. ఇంతవరకూ ఏ మంత్రీ ఆ విషయంపై తనను కలవలేదని స్పష్టం చేశారు.

కులసర్వే ఆధారంగానే మంత్రివర్గ విస్తరణ
"ఇదివరకు కర్ణాటక ప్రభుత్వం చేసిన కులగణన తెలంగాణ మాదిరి పక్కా ఫార్మాట్‌లో లేదు. కర్ణాటక ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రికి దాని గురించి వివరించడానికి పార్టీ పెద్దలు నన్ను పిలిచారు. మంగళవారం ఇక్కడి పార్టీ ప్రధాన కార్యాలయంలో మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ, సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లతో సుమారు గంటన్నర పాటు దీనిపై మాట్లాడాం. తెలంగాణలో చేపట్టింది కేవలం కుల సర్వే కాదు. కుటుంబాల స్థితిగతులను 360 డిగ్రీల్లో తెలుసుకోవడానికి ప్రయత్నించాం. ఇంటింటికీ తిరిగి 60 రోజుల్లో 96.5% కుటుంబాల వివరాలను ఎన్యుమరేటర్లు సేకరించారు. 3.5% మంది ఆ సర్వేలో పాల్గొనకపోవడంతో వారికి మరోసారి అవకాశం ఇవ్వడానికి టోల్‌ఫ్రీ నంబర్లు, ఆన్‌లైన్ వ్యవస్థ, వార్డులు, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు పెట్టి వివరాలు సేకరించే ప్రయత్నం చేశాం. ఈ సర్వేలో వచ్చిన వివరాల ఆధారంగానే మంత్రివర్గ విస్తరణ చేపట్టి ఎస్సీ, బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాం. కులగణన ఆధారంగా ప్రభుత్వపరమైన చర్యల గురించి మదింపు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ ఏర్పాటు చేశాం. ఆ కమిటీ సిఫార్సుల ప్రకారం ముందడుగు వేస్తాం.

శాఖల గురించి పార్టీ పెద్దలతో చర్చిస్తే తప్పేముంది?
తాను పార్టీ పెద్దలతో మంత్రి పదవుల గురించి మాట్లాడేందుకు వచ్చి ఉంటే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి, పీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి కూడా ఉండేవారు. దానిపై చర్చలేదు కాబట్టే వారెవరూ రాలేదు. మంత్రి పదవుల కేటాయింపు అంశం ముఖ్యమంత్రి అధికార పరిధిలోనిదన్నది వాస్తవమే. ఇక్కడ నడుస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం తప్ప రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాదు. అందువల్ల శాఖల కేటాయింపు గురించి పార్టీ పెద్దలతో చర్చించడంలో తప్పు లేదు. భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఢిల్లీ పెద్దలతో మాట్లాడకుండానే మంత్రివర్గ విస్తరణలు చేపడుతున్నారా? ఢిల్లీలో ఉన్న మీడియా ప్రతినిధులు మీ ప్రధాన కార్యాలయం ఉన్న హైదరాబాద్‌కు వార్తలు పంపుతున్నట్లుగానే నేను మా పార్టీ ప్రధాన కార్యాలయం ఉన్న ఢిల్లీకొచ్చి మాట్లాడుతున్నా. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులతో మాట్లాడేందుకు నేను 500 సార్లయినా ఇక్కడికొస్తా. నా గురించి అవాకులు చవాకులు మాట్లాడుతున్న భారాస నాయకులు ఉదయం లేచిన దగ్గరి నుంచి ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు ఎందుకు వెళ్తున్నారు? మంత్రుల శాఖల కేటాయింపులో కాస్త ఆలస్యమైతేనే కొందరు పనిలేని నాయకులు ఏవేవో మాట్లాడుతున్నారు. కేసీఆర్ హయాంలో ఆరునెలలపాటు మంత్రివర్గమే ఏర్పాటు కాలేదన్న విషయం వాళ్లకు గుర్తులేదా?

కిషన్‌రెడ్డే అతి పెద్ద సమస్య
రాష్ట్రంలో కేసీఆర్‌కేటీఆర్‌కిషన్‌రెడ్డిల ఆలోచన ఒక్కటి కాబట్టే ఎవరూ కులగణన సర్వేలో పాల్గొనలేదు. కేసీఆర్, కేటీఆర్ ఏం చెబితే కిషన్‌రెడ్డి అది చేస్తున్నారు. భాజపా ఎంపీ ఈటల రాజేందర్ కాళేశ్వరం కమిషన్ ముందుకెళ్లి అంతా నిబంధనల ప్రకారమే జరిగిందని చెబితే కిషన్‌రెడ్డి దాన్నే సమర్థించారు. కేసీఆర్ కుటుంబానికి కాళేశ్వరం ఏటీఎంలా మారిందని ఇదివరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా చెప్పిన మాటలను కూడా కాదని రాష్ట్ర భాజపా నాయకులు కాళేశ్వరాన్ని సమర్థించడం దేనికి సంకేతం? కేసీఆర్ మెట్రో విస్తరణను వ్యతిరేకిస్తే కిషన్‌రెడ్డి కూడా వ్యతిరేకిస్తున్నారు. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, ప్రహ్లాద్‌జోషీలు తమ స్వరాష్ట్ర రాజధానులైన చెన్నై, బెంగళూరులకు మెట్రో ప్రాజెక్టులు తీసుకెళ్తే కిషన్‌రెడ్డి మాత్రం హైదరాబాద్‌కు మెట్రో రాకుండా అడ్డుపడుతున్నారు. రాష్ట్రం నుంచి 8 మంది భాజపా ఎంపీలున్నా ఏనాడూ ప్రధానమంత్రిని కలిసి అభివృద్ధి గురించి అడిగిన పాపాన పోలేదు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రాజెక్టుల వివరాలు ప్రధాని నాకు అందించిన వెంటనే అన్నింటినీ పరిష్కరించాను. బీబీనగర్ ఎయిమ్స్ సమస్యను కేంద్రమంత్రి నడ్డా నా దృష్టికి తీసుకొచ్చిన వెంటనే ఆగమేఘాల మీద పరిష్కరించాను. ఏ ముఖ్యమంత్రీ ఇంత వేగంగా స్పందించలేదని ఆయన నన్ను ప్రశంసించారు కూడా. కానీ కిషన్‌రెడ్డి మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. కేంద్ర ప్రాజెక్టులపై ఆయన ఢిల్లీలోనో, హైదరాబాద్‌లోనో ఎందుకు సమీక్ష నిర్వహించరు? కావాలంటే నేను యంత్రాంగాన్ని తీసుకుని ఢిల్లీకి వస్తా. లేదా.. హైదరాబాద్ సెక్రటేరియట్‌లోనే ఏర్పాట్లు చేస్తా. ఆటోమేటిక్‌గా వచ్చే నిధులను తన ఘనతగా చెప్పుకోవడం తప్ప, కిషన్‌రెడ్డి స్వయంగా ప్రయత్నించి రాష్ట్రానికి తెచ్చిందేమీ లేదు. రాష్ట్రానికి అతిపెద్ద సమస్య కిషన్‌రెడ్డే" అంటూ సీఎం విమర్శించారు.

తెలంగాణ దుష్మన్‌లను కాంగ్రెస్‌లోకి రానివ్వం
కేసీఆర్ కుటుంబమంతా కొరివి దయ్యాలే. తెలంగాణకు తీరని ద్రోహం చేసిన ఆ కుటుంబంలో ఎవరికీ నేనుండగా కాంగ్రెస్‌లోకి ప్రవేశం ఉండదు. ఈ మాట రాసి పెట్టుకోండి. కవిత లేఖ ఒట్టి డ్రామా. వారి గురించి ప్రజలెవరూ మాట్లాడుకోవడం లేదన్న భయంతోనే లేఖ పేరుతో డ్రామా ఆడారు. కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయన్న కవిత.. తన తండ్రి కాళేశ్వరం కమిషన్ ముందుకు వెళ్తుంటే, ఆ దయ్యాలతో పాటే ఆమె కూడా ఉన్నారు. చట్టబద్ధంగా ఏర్పాటు చేసిన కమిషన్లు పిలిస్తే దాన్ని కక్ష సాధింపు అని చెప్పడంలో అర్థం లేదు. కాళేశ్వరంలో జరిగిన విషయాల గురించి నేను రెండురోజుల్లో విలేకర్ల సమావేశం పెట్టి అన్ని వివరాలూ చెబుతా. ఇదేమీ కమిషన్‌ను ప్రభావితం చేయడం కిందికి రాదు. కమిషన్ స్వతంత్రంగా పనిచేస్తుంది. దానికి, ప్రభుత్వానికి సంబంధం లేదు. మా దగ్గర ఉన్న రికార్డుల ఆధారంగా మా వాదనను ప్రజలకు వినిపిస్తాం.

కేసీఆర్ తన మంత్రివర్గంలో 13 మంది అగ్రవర్ణాల వారికి స్థానం కల్పించి.. 40% జనాభాకు ప్రాతినిధ్యం వహించే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కలిపి కేవలం 3 పదవులిచ్చారు. కానీ మేం ఎస్సీలకు నాలుగు మంత్రి పదవులు, ఒక స్పీకర్ పదవి కేటాయించాం. ఎస్టీలకు ఒక మంత్రి పదవి, ఒక డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చాం. రాష్ట్రంలో 29 మంత్రిత్వశాఖల్లో ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శుల పదవుల్లోనూ 80% మంది బలహీనవర్గాలకు చెందినవారే ఉన్నారు. మంత్రివర్గంతో పాటు, బ్యూరోక్రసీలోనూ సామాజిక న్యాయం అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుంది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
మనుషులున్నంత వరకూ నక్సలిజం ఉంటుంది
మనుషులున్నంతవరకూ సామాజిక సమస్యలుంటాయి. అవి ఉన్నంతవరకూ నక్సలిజమూ కొనసాగుతుంది. ప్రస్తుత ఎన్‌కౌంటర్లతో అది ముగిసిపోయిందనుకోవట్లేదు. పశ్చిమబెంగాల్‌లో నక్సలైట్ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసినా.. ఇందిరాగాంధీ భూసంస్కరణలు అమలు చేయడంతో దాని తీవ్రత తగ్గింది. తెలంగాణలోనూ అప్పట్లో ప్రభుత్వం 35 లక్షల ఎకరాలను ఎస్సీ, ఎస్టీలకు పంచింది. అన్ని విషయాల్లో అట్టడుగు వర్గాలకు న్యాయం చేయాలన్నదే నక్సల్‌బరీ ఉద్యమం ప్రధానోద్దేశం. ఆ ఎజెండాను కాంగ్రెస్ అమలు చేసింది. ఇప్పుడు మేం చేపట్టిన కులగణన కూడా నక్సలిజం సమస్యను తగ్గిస్తుంది. కానీ కేవలం కులాల లెక్కలు తీసి వదిలేస్తే ఫలితం ఉండదు. దాని ఆధారంగా అభివృద్ధి చేయాల్సి ఉంది.

మొదటి పేజీ తరువాయి

## ఓఎంసీ కేసు.. గాలి జనార్దనరెడ్డికి బెయిల్



**ఈ నలుగురికి నాంపల్లి సీబీఐ కోర్టు విధించిన ఏడేళ్ల జైలు శిక్షను సస్పెండ్ చేసింది. దేశం విడిచి వెళ్లరాదని, రూ.10 లక్షలు సొంత పూచీకత్తు సమర్పించాలని షరతు విధించింది.**


**పదిహేనేళ్ల పాటు సుదీర్ఘంగా సాగిన ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో మే 6న నాంపల్లి సీబీఐ కోర్టు తీర్పు వెలువరించింది. ప్రధాన నిందితులైన బి.వి.శ్రీనివాసరెడ్డి, గాలి జనార్దనరెడ్డి, వి.డి. రాజగోపాల్, మెఫజ్ అలీఖాన్‌లకు ఒక్కొక్కరికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల చొప్పన జరిమానా విధించింది. ప్రభుత్వ ఉద్యోగి అయిన రాజగోపాల్‌కు అదనంగా 4 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు తాజా తీర్పుతో వీరికి ఊరట లభించింది.**

**శ్రీలక్ష్మి పిటిషన్‌పై విచారణ వాయిదా**

**ఓఎంసీ కేసులో నిందితురాలైన ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి పిటిషన్‌పై విచారణను హైకోర్టు 19వ తేదీకి వాయిదా వేసింది. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి నోటీసులు జారీ చేసింది.**

మొదటి పేజీ తరువాయి

# 10 వేల మందికి శిక్షణ



ఈ కబురు, హైదరాబాద్: ప్రపంచంలోనే తెలంగాణను నైపుణ్య రాజధానిగా మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్న యూకేకు చెందిన సెమీ కండక్టర్ దిగ్గజ సంస్థ ఆర్మ్ హోల్డింగ్స్ సంస్థ ప్రతినిధులతో ఆయన బుధవారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో భేటీ అయ్యారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనుకూలతలు, పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ఈ సందర్భంగా వివరించారు. "సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్‌లో దిగ్గజ సంస్థగా ఉన్న ఆర్మ్ హోల్డింగ్స్.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించడం మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. తెలంగాణ రైజింగ్‌లో భాగమయ్యేందుకు ముందుకొచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు. పరిశ్రమ ఏర్పాటులో అన్ని రకాలుగా అండగా ఉంటాం. మాకున్న పెద్ద ఆస్తి యువత. వారిలో ప్రతిభకు కొదువ లేదు. కొంచెం సానబెడితే మెరికల్లా తయారవుతారు. పరిశ్రమలకు అవసరమైన రెడిమేడ్ మానవ వనరులను అందించే బాధ్యతను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా మా ప్రభుత్వం తీసుకుంది. సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్‌లో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా తెలంగాణ యువతను తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఈ ప్రయాణంలో మీరు కూడా భాగస్వాములు కావాలన్నది మా ఆకాంక్ష. 10వేల మంది యువతకు శిక్షణనిచ్చే బాధ్యతను తీసుకోవాలి" అని మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. ఈ సమావేశానికి హాజరైన మలేసియాకు చెందిన దిగ్గజ సంస్థ స్ప్రింగ్ సెమీ కండక్టర్స్ సీఈవో కెన్ కూ మాట్లాడుతూ.. "మా వంతుగా ఇక్కడి యువతను సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్‌లో అత్యుత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దేలా ప్రత్యేక కరిక్యులమ్ రూపొందిస్తాం. విద్యా సంస్థల సహకారంతో ఆరు నెలలు ఇక్కడ శిక్షణ.. మిగిలిన కాలం తైవాన్, దక్షిణ కొరియా, జపాన్ తదితర దేశాల్లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు అవకాశం కల్పిస్తాం. టీ కన్సల్ట్ సహకారంతో 2030 నాటికి 10వేల మంది యువతకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తాం" అని తెలిపారు. ఈ సమావేశంలో టీ కన్సల్ట్ ఛైర్మన్ సందీప్‌కుమార్ మక్తాలా, వరల్డ్ తెలుగు ఐటీ కౌన్సిల్ మలేసియా విభాగం ప్రెసిడెంట్ మారుతీ, ఇతర ప్రతినిధులు మహేశ్ నటరాజ్, వాకిటి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రంలో పరిశ్రమలు రాకుండా భారాస కుట్రలు: రాష్ట్రంలో పరిశ్రమలు రాకుండా భారాస కుట్రలు చేస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆరోపించారు. యువతకు ఉపాధి దొరకకుండా చేయాలన్నదే ఆ పార్టీ దుర్మార్గపు ఆలోచనగా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలోకి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ప్రైవేట్ సెక్టారులో లక్షన్నర ఉద్యోగాలు కల్పించామన్నారు. ఈ పెట్టుబడులన్నీ కార్యరూపం దాలిస్తే తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదని గులాబీ పార్టీ కలవర పడుతోందని విమర్శించారు.

# తెలంగాణ కొత్త మంత్రుల శాఖలు ఇవే



కాగా, ఎవరికి ఏ శాఖ కేటాయిస్తారనే దానిపై పార్టీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుపై కాంగ్రెస్ అధిష్టానం పెద్ద కసరత్తే చేసింది. పార్టీలో సీనియార్టీ, అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ఎవరికి, ఏ శాఖ కట్టబెట్టాలన్న దానిపై ఓ నిర్ణయానికి వచ్చింది. శాఖల కేటాయింపుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో పార్టీ అధిష్టానం పెద్దలతో వరుసగా భేటీ అయ్యారు. శాఖల కేటాయింపు అంశంపై చర్చించేందుకు సోమవారం ఢిల్లీ వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరాభవన్‌లో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, పార్టీ సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. సుమారు గంటన్నర పాటు శాఖల కేటాయింపుపై చర్చించారు. అనంతరం నిర్ణయం తీసుకున్నారు.

# లాస్ ఏంజెలెస్ 'యాంటీ ఐస్' కార్చిచ్చుకు కేంద్రంగా ఎందుకు..?

ఇక యూఎస్ టుడే రిపోర్టు ప్రకారం విదేశాల్లో జన్మించి లాస్ ఏంజెలెస్‌లో ఉంటున్న వారిలో సగం మంది సహజ సిద్ధమైన విధానాల్లో పౌరసత్వం పొందారు. ఈ కౌంటీలోని 18 లక్షల మంది హిస్పానిక్ లేదా లాటిన్ జాతులకు చెందినవారే. దాదాపు 50 లక్షల మంది ఆసియా వాసులు, హవాయ్ లేదా పసిఫిక్ దీవుల నుంచి వచ్చినవారు కూడా ఇక్కడ ఉంటున్నారు. ఈ నగరం మొత్తంలో 56 శాతం మంది ఇంగ్లిష్ కాకుండా మరో భాషను కూడా ఇంట్లో మాట్లాడతారు. వీటిల్లో స్పానిష్ ఎక్కువగా ఉంటుంది. ఈ భిన్నత్వమే ట్రంప్ చేపట్టిన వలస వ్యతిరేక విధానాలకు ప్రధాన లక్ష్యంగా మారుతోంది.

రోజుకు కనీసం 3,000 మంది అక్రమ వలసదారులను అదుపులోకి తీసుకోవాలంటూ ట్రంప్ కార్యవర్గం ఇటీవల ఆదేశాలు జారీ చేయడంతో ఆందోళనలు మొదలయ్యాయి. ఈక్రమంలో శుక్రవారం లాస్ ఏంజెలెస్ నగరంలో లాటిన్ ప్రజలు అత్యధికంగా ఉండే ప్రదేశాల్లో ఐసీఈ అధికారులు దాడులు మొదలుపెట్టారు. దీనికి వ్యతిరేకంగా ఆందోళనలు పురుడుపోసుకున్నాయి. నిరసనకారులు కోడిగుడ్లు, పెప్పర్ స్ప్రేలు, బాణసంచా వంటివి పోలీసుల పైకి ప్రయోగించారు. దీంతో ఇక్కడ 4,000 మంది నేషనల్ గార్డ్స్, 700 మంది మెరైన్లను ట్రంప్ మోహరించారు.

లాస్ ఏంజెలెస్‌కు వారినుంచి విముక్తి కల్పిస్తాం: ట్రంప్
ఈ నగరంలో యాంటీ ఐస్ ఆందోళనలు చేస్తున్నవారిని జంతువులు, విదేశీ శత్రువులతో ట్రంప్ పోల్చారు. అమెరికా 250వ ఆర్మీడే సందర్భంగా ఫోర్ట్ బ్రాగ్‌లో మాట్లాడుతూ మిలిటరీ మోహరింపును సమర్థించుకొన్నారు. పశ్చిమతీరంలోని ఆ నగరానికి విముక్తి కల్పిస్తామన్నారు. ఈసందర్భంగా ఆయన దూకుడుగా మాట్లాడారు. కాలిఫోర్నియా గవర్నర్ న్యూసమ్ తీరును ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. "విదేశీ శత్రువులు మన దేశంలోని ఓ నగరాన్ని ఆక్రమించడానికి నేను అంగీకరించను. ప్రస్తుతం ఆ నగరం చెత్తకుప్పలా మారింది. దానిలోని పలు ప్రాంతాలు క్రిమినల్స్ ఆధీనంలో ఉన్నాయి. అక్కడి పరిస్థితిని నియంత్రణలోకి తెచ్చుకోవడానికి ప్రభుత్వం అన్నిరకాల వనరులను వినియోగిస్తుంది. లాస్ ఏజెంలెస్‌కు విముక్తి కల్పించి.. దానిని సురక్షిత నగరంగా మారుస్తాను" అని పేర్కొన్నారు.



# 'ఈ-కబురు' కథనానికి స్పందన...



ఖాజాగూడ స్టేడియంను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ భోర్కడే

### ఖాజాగూడ స్టేడియాన్ని సందర్శించిన శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్

### అధికారులతో కలిసి జిహెచ్ఎంసి గ్రౌండ్ పరిశీలన

ఈకబురు, శేరిలింగంపల్లి : ఐటీ కారిడార్ పరిధిలో కోట్లాది రూపాయలతో నిర్మించి నిరుపయోగంగా వదిలివేసిన ఖాజాగూడ మినీ స్టేడియం దుస్థితిపై 'ఈకబురు' దినపత్రిక ప్రచురించిన కథనానికి జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు స్పందించారు. 'ఖాజాగూడ స్టేడియంలో ప్రైవేటు తిష్ట' అంటూ సోమవారం సంచికలో ఈకబురు ప్రచురించిన కథనానికి స్పందించిన శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ భోర్కడే, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డిలు పలు విభాగాల అధికారులతో కలిసి బుధవారం ఖాజాగూడ స్టేడియాన్ని పరిశీలించారు. నిర్మాణం చేపట్టి ప్రారంభించకుండా వదిలేసిన మినీ స్టేడియాన్ని సందర్శించడంతో పాటు స్టేడియంలో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ యార్డ్, ప్రైవేటు నిర్మాణ సంస్థ గిడ్డర్ సామాగ్రిని, గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన ప్రైవేట్ బాక్స్ నెట్ క్రికెట్ ను పరిశీలించారు. ఖాజాగూడ స్టేడియం ప్రస్తుతం ప్రాజెక్టు విభాగం ఆధీనంలో ఉందని, మినీ స్టేడియాన్ని జీహెచ్ఎంసికి అప్పగించాలని లేఖ రాసినట్లు అధికారులు తెలిపారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖాజాగూడ గ్రామంలోని సర్వే నెంబరు 27లో ఉన్న 7.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జిహెచ్ఎంసి గ్రౌండ్ లో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2012 జూలై 21వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. మొదటి దశలో 2.10కోట్ల రూపాయల వ్యయంతో మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణ పనుల కోసం ప్రాజెక్టు విభాగం ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. శంకుస్థాపన అనంతరం కొద్దిమేర పనులు జరిగినా.. అనంతర కాలంలో సంవత్సరాల తరబడి మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వం 2019లో తిరిగి స్టేడియం పూర్తి చేసేందుకు మరోసారి పనులు చేపట్టింది. పనుల పూర్తి కోసం మరో 25 లక్షల రూపాయలు మంజూరు చేయడం, అవీ సరిపోక పోవడంతో మరో 11 లక్షల రూపాయల అదనపు నిధులను జిహెచ్ఎంసి మంజూరు చేసింది. చివరికి 2,700గజాల విస్తీర్ణంలో 4 బాడ్మింటన్ కోర్టులు, ఓ క్యారమ్స్ గది, అధునాతన సౌకర్యాలతో కూడిన మల్టి జిమ్, కోచ్ తో పాటు క్రీడాకారుల అవసరాల కోసం రెండు గదుల నిర్మాణం పూర్తి చేశారు. ఈ పనులు పూర్తయి 7ఏళ్లు గడుస్తున్నా మినీ స్టేడియం ప్రారంభోత్సవం చేయకపోవడంతో ప్రస్తుతం మినీ స్టేడియం శిథిలావస్థకు చేరుకుంది. మరోవైపు మినీ స్టేడియం వెనుక ఉన్న జిహెచ్ఎంసి గ్రౌండ్ లో ప్రైవేటు వ్యక్తులు తిష్ట వేశారు. ఓ నిర్మాణ సంస్థ గిడ్డర్ తయారీ సామాగ్రిని ఏర్పాటు చేయడంతో పాటు ప్రైవేటు బాక్స్ నెట్ క్రికెట్ ఏర్పాటు చేశారు మినీ స్టేడియాన్ని ఆనుకొని చెత్త డంపింగ్ కేంద్రాన్ని సైతం నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ఈ కబురు దినపత్రిక సోమవారం సంచికలో ""ఖాజాగూడ స్టేడియంలో ప్రైవేటు తిష్ట... పుష్కరం దాటినా ప్రారంభానికి నోచుకోని మినీ స్టేడియం"" అంటూ కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన శేరిలింగంపల్లి జీహెచ్ఎంసి అధికారులు, గచ్చిబౌలి డివిజన్ కార్పోరేటర్ బుధవారం ఖాజాగూడ స్టేడియాన్ని సందర్శించారు.





ఖాజాగూడ స్టేడియంను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ భోర్కడే

# ప్రభుత్వ స్కూళ్లలో ప్రీ ప్రైమరీ



*ఈ ఏడాది నుంచే అందుబాటులోకి..*

*తొలిదశలో 210 పాఠశాలల్లో ఏర్పాటు*

*ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం*

ఈ కబురు, హైదరాబాద్: ప్రైవేటు పాఠశాలల మాదిరిగానే ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనూ పూర్వ ప్రాథమిక (ప్రీ ప్రైమరీ) విద్య అందుబాటులోకి రానుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే తొలిదశ కింద 210 స్కూళ్లలో దీనికి సంబంధించిన తరగతులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. హనుమకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లో ఈ ప్రీ ప్రైమరీ విద్యను అందుబాటులోకి తెస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. జిల్లా అధికారులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఒకటవ తరగతిలో చేరే ముందు, అందుకు సన్నద్ధతగా ఈ పూర్వ ప్రాథమిక విద్య దోహదపడుతుంది. ఆటలు, పాటలు, కథల రూపంలో విద్యాబోధన ఉంటుంది. ప్రైవేటు పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ పేరిట ప్రీ ప్రైమరీ విద్య రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుంది. అయితే ప్రభుత్వ స్కూళ్లలో ఏడాది పాటే ఇందుకు సంబంధించిన తరగతులు ఉంటాయని అధికార వర్గాల సమాచారం

# ప్రపంచ ఆరోగ్య సంక్షోభంగా మారుతున్న ఫ్యాటీ లివర్..




కార్యక్రమంలో పాల్గొన్న ఆసుపత్రి డాక్టర్లు

### ఏఐజి హాస్పిటల్స్ లో ఫ్యాటీ లివర్ పై అవగాహన సదస్సు

ఈకబురు, శేరిలింగంపల్లి : ఫ్యాటీ లివర్ వ్యాధి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత విస్తృతమైన కాలేయ సమస్యలలో ఒకటని, దాదాపు నలుగురిలో ఒకరిని ప్రభావితం చేస్తుందని ఏఐజి హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఫ్యాటీ లివర్ ప్రపంచ ఆరోగ్య సంక్షోభంగా మారుతున్నందున ముందస్తు గుర్తింపు, జీవనశైలి మార్పులే నివారణకు మార్గమని పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ ఫ్యాటీ లివర్ దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలి ఏఐజి ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నిశ్చల జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారాల కారణంగా ఊబకాయం, మధుమేహం పెరిగుతుందని, ఆల్కహాలిక్ లేని ఫ్యాటీ లివర్ వ్యాధి నిశ్శబ్దంగా ప్రజారోగ్య సంక్షోభంగా మారిందన్నారు. వీటిని తగ్గించడానికి సాధారణ స్క్రీనింగ్‌లు, ముందస్తు రోగ నిర్ధారణ,ఆధారాల ఆధారిత జీవనశైలి మార్పుల ప్రాముఖ్యత అవసరమని తెలియజేశారు. "కొవ్వు కాలేయం ఒక అంటువ్యాధి నుండి స్థానిక వ్యాధిగా మారిందని, ఇది గుండెపోటు నుండి మధుమేహం వరకు కార్డియోమెటబాలిక్ వ్యాధులకు కేంద్రంగా ఉందని పేర్కొన్నారు. ఈ ఫ్యాటీ లివర్ కి నిజమైన పరిష్కారం అవగాహనతో ప్రారంభమవుతుందన్నారు. చిన్న వయస్సు నుండే రోగ నిర్ధారణ, మన పాఠశాలల్లో, మన ఇళ్లలో మన సమాజాలలో కాలేయ ఆరోగ్యం గురించి మాట్లాడటం ప్రారంభించాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పకుండా వ్యాయామం, బరువు నిర్వహణ వంటి జీవనశైలి మార్పులు కొవ్వు కాలేయ వ్యాధిని నివారించడానికి, నియంత్రించడానికి కీలకమని తెలియజేసారు. ఏఐజి హాస్పిటల్ క్రిటికల్ కేర్ హెపటాలజీ డైరెక్టర్ డాక్టర్ ఆనంద్ కులకర్ణి మాట్లాడుతూ.. ఫ్యాటీ లివర్ ముదిరే వరకు గుర్తించబడదని తెలిపారు. అల్ట్రాసౌండ్‌లో ఫ్యాటీ లివర్ కనిపించినప్పుడు కాలేయంలో దాదాపు 30శాతం ఇప్పటికే కొవ్వుతో నిండి ఉంటుందని, అది ఒక మేల్కొలుపు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అనుజ్ కపాడియా, హెపటాలజీ చీఫ్ డాక్టర్ పిఎన్ రావు, రోగులు, వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# దాటవేత ధోరణిలో సమాధానం

అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయి, ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న ఎస్ఐబీ మాజీ డీఎస్పీ డి.ప్రణీత్‌రావును సిట్ అధికారులు విచారణకు పిలిచారు. ఇద్దరినీ కలిపి కొన్ని ప్రశ్నలు అడిగినట్టు తెలిసింది. అమెరికా నుంచి వచ్చిన తర్వాత సోమవారం తొలిసారిగా విచారణకు హాజరైన ప్రభాకర్‌రావు ఫోన్ ట్యాపింగ్‌తో తనకు ఏం సంబంధం అని, దానికి అనుమతి ఇవ్వడానికి సాధికారిక కమిటీ ఉంటుందని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే అప్పట్లో ఆయా ఫోన్లు ట్యాప్ చేయడానికి సహకరించాల్సిందిగా టెలికం సర్వీస్ ప్రొవైడర్లకు ఎస్ఐబీ నుంచి వెళ్లిన లేఖల్ని సిట్ బుధవారం తీసుకొచ్చింది.వీటిపై డిజిగ్నేటెడ్ అధికారిగా ప్రభాకర్‌రావు పేరు, ఆయన సంతకం ఉండటాన్ని సిట్ ప్రస్తావించింది. ట్యాపింగ్‌తో సంబంధం లేనప్పుడు ఆయా లేఖలపై ఎందుకు సంతకం చేశారంటూ ప్రశ్నించింది. జర్నలిస్టులు, వ్యాపారులతోపాటు నేతలు, వారి కుటుంబీకుల ఫోన్లు ఎందుకు ట్యాప్ చేశారని, వారి నంబర్లను ట్యాప్ చేస్తున్నారని తెలిసినప్పుడు లేఖలపై సంతకాలు ఎందుకు చేశారని అధికారులు ప్రశ్నించారు. కొందరు జడ్జిలకు సంబంధించిన కాల్ డిటేల్స్ సేకరించడం వెనుక ఉన్న కారణాలపై ఆరా తీశారు. అయితే పోలీసులు అడిగిన ప్రశ్న లకు ప్రభాకర్‌రావు దాటవేత ధోరణిలో సమాధానం ఇచ్చారు. ప్రణీత్‌రావుతో కలిపి ప్రభాకర్‌రావును విచారించిన సిట్ గతంలో సేకరించిన ఆధారాలు, తదితరాలను వీరి ముందు ఉంచారు. హార్డ్‌డిస్క్ శకలాల్ని మూసీలో ఎందుకు వేశారు ఇద్దరినీ వేర్వేరుగా కొన్ని ప్రశ్నలు అడిగిన పోలీసులు... కలిపి అవే అడిగి, వారు చెప్పిన సమాధానాలతో సరిచూశారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ల కోసమే ఎస్ఐబీలో స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) ఏర్పాటు చేశానని చెప్పిన ప్రభాకర్‌రావు సమర్థత ఆధారంగానే ఆ బాధ్యతలు ప్రణీత్‌కు అప్పగించినట్టు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సిట్ అధికారులు అలాంటప్పుడు ఎస్ఓటీ కోసం ప్రత్యేకంగా కంప్యూటర్లు, సర్వర్లు ఎందుకు ఏర్పాటు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. మావోయిస్టుల కోసం తాము చేసే కొన్ని అత్యంత రహస్య ఆపరేషన్ల కోసమే అలా ఏర్పాటు చేసినట్టు ప్రభాకర్‌రావు సమాధానం ఇచ్చారు. కొన్ని ఆపరేషన్లకు సంబంధించిన సమాచారం బయటకు పొక్కితే జాతీయ భద్రతతోపాటు కొందరు అధికారులకు ముప్పు అని, ఆ కారణంగానే ఆయా ఆపరేషన్ల సమాచారం ఉన్న హార్డ్‌డిస్క్‌లు పని పూర్తయిన తర్వాత ధ్వంసం చేస్తుంటామని ప్రభాకర్‌రావు సిట్ అధికారులకు తెలిపారు. అలా ధ్వంసం చేయడం సర్వసాధారణమే అయితే వాటి శకలాలను తీసుకెళ్లి నాగోలు వద్ద మూసీనదిలో పారేయాల్సిన అవసరం ఏమిటంటూ ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావులను సిట్ ప్రశ్నించింది. దీనికి సంబంధించి ప్రభాకర్‌రావు నుంచి సమాధానం రాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ విచారణ మొత్తాన్ని పోలీసులు వీడియో రికార్డింగ్ చేశారు. శనివారం మరోసారి విచారణకు రావాల్సిందిగా ప్రభాకర్‌రావుకు నోటీసులు జారీ చేశారు.
ఆ రోజు ఈ కేసులో అరెస్టు అయి, బెయిల్‌పై ఉన్న మరో నిందితుడితో కలిపి విచారించనున్నట్టు తెలిసింది. ఇప్పటికీ ప్రభాకర్‌రావు నుంచి సరైన సహకారం లభించట్లేదని, పక్కా ఆధారాలు చూపించి ప్రశ్నిస్తున్నా ఆయన సమాధానాలు చెప్పట్లేదని సిట్ చెబుతోంది. తనను ట్యాపింగ్, సీడీఆర్‌ల విశ్లేషణకు సంబంధించిన ఆదేశాలు ప్రభాకర్‌రావు నుంచి వచ్చాయని ప్రణీత్‌రావు చెబుతుండగా... ప్రభాకర్‌రావు మాత్రం వీటిని ఖండిస్తున్నారని వివరిస్తున్నారు.



# తెలంగాణ కరువుకు, దాహార్తికి పరిష్కారం చూపిన కేసీఆర్ : కొమిరిశెట్టి సాయిబాబా



బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కమిషన్ కార్యాలయం వద్ద సాయిబాబా



బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కమిషన్ కార్యాలయం వద్ద సాయిబాబా

### శేరిలింగంపల్లి శ్రేణులతో బీఆర్కే భవన్ కు తరలివెళ్లిన సాయిబాబా

ఈకబురు, శేరిలింగంపల్లి : దశాబ్దాల తెలంగాణ ప్రాంత కరువుకు, దాహార్తికి కళేశ్వరం ప్రాజెక్టుతో శాశ్వత పరిష్కారం చూపించిన దార్శనికుడు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరైన బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ కు సంఘీభావంగా బుధవారం నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సాయిబాబా బీఆర్కే భవన్ కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ కేసీఆర్ జీవితం తెలంగాణ లో ఒక చరిత్రగా నిలిచిపోతుంది అని కొనియాడారు. గత ప్రభుత్వాలు 60 ఏళ్లలో చేయలేని అనేక కార్యక్రమాలను కేసీఆర్ విజయవంతంగా 10 ఏళ్ల పాలనలో సాధించి చూపారన్నారు. ప్రజాస్వామ్య పోరాటంతో ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చారని పేర్కొన్నారు. ఉద్యమం ద్వారా కోట్లాది మందికి స్వరాష్ట్ర ఆశయాన్ని అందించారని, తెలంగాణ ఆర్తితో తెలంగాణ కోసం, కేవలం తెలంగాణ కోసమే కేసీఆర్ పనిచేశారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన కేసీఆర్ బలం, జీవన దృక్కోణాన్ని అర్థం చేసుకోవడానికి కాంగ్రెస్ నాయకులకు జీవితకాలం చాలదన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ అందించిన నీళ్లను తాగుతున్న కాంగ్రెస్ నాయకులు కేసిఆర్ మీదే విషం చెబుతున్నారని దుయ్యబట్టారు. నేడు తెలంగాణ ప్రజలు కేసీఆర్ పాలనను బలంగా కోరుకుంటున్నారని, భవిష్యత్తులో జరిగే ఏ ఎన్నికలోనైనా బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పెట్టేందుకు రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కళ్లు బైర్లు కమ్మేలా.. వామ్మో కాళేశ్వరం

## ఈఈ అక్రమాస్తులు ఇన్ని వందల కోట్లా

ఈ కబురు,హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారం కేసులో నీటిపారుదలశాఖ ఈఈ నూనె శ్రీధర్ నివాసాలతో పాటు బంధువుల ఇళ్లలోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏకకాలంలో 12 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు చేపట్టిన దాడుల్లో నూనె శ్రీధర్‌కు రూ.200కోట్లు ఆస్తుల్ని గుర్తించినట్లు సమాచారం.
ఏసీబీ అధికారుల దాడుల్లో హైదరాబాద్‌తో పాటు 15 చోట్ల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారుల గుర్తించారు. హైదరాబాద్ , కరీంనగర్ వరంగల్‌లో 19 ప్లాట్లు, తెల్లాపూర్‌లో విల్లా, అమీర్‌పేటలో కమర్షియల్ కాంప్లెక్స్, కరీంనగర్‌లో 16 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్ లో ఇండివ్యూజువల్ హౌస్, నాంపల్లిలో మల్టీ స్టోరేజ్ బిల్డింగ్, పలు హోటల్స్ బినామీ పెట్టుబడులు పెట్టినట్లు ఏసీబీ అధికారులు సోదాల్లో తేలినట్లు సమాచారం. నూనె శ్రీధర్ తన కుమారుడు డెస్టినేషన్ మ్యారేజీని థాయిలాండ్‌లో చేసినట్లు ఆధారాల్ని సేకరించారు. దీంతో పాటు భారీగా బంగారం, నగలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు.
కాగా, నూనె శ్రీధర్ ఎస్ఆర్ఎస్పీ డివిజన్ 8లో ఈఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో 6,7,8 ప్యాకేజీల పనులను ఆయన పర్యవేక్షించారు. ప్రస్తుతం ఇరిగేషన్ ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడిగా కూడా శ్రీధర్ వ్యవహరిస్తున్నారు.



# సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీలో విదేశీ మద్యం , గంజాయి



ఈ కబురు,చేవెళ్ల గ్రామీణం: సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీలో విదేశీ మద్యం, గంజాయి లభ్యమయ్యాయి. పుట్టినరోజు సందర్భంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఈర్లపల్లి శివారులోని రిసార్టులో స్నేహితులకు మంగళవారం రాత్రి ఆమె పార్టీ ఇచ్చారు.
ఈ వేడుకలకు సుమారు 50 మంది వరకు మంగ్లీ కుటుంబ సభ్యులు, స్నేహితులు హాజరయ్యారు. వీరిలో సినీ పరిశ్రమకు చెందిన వారు కూడా ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలో రాత్రి 2 గంటల సమయంలో ఎస్‌వోటీ పోలీసులు రిసార్టుపై దాడులు చేశారు. సింగర్ మంగ్లీ, పార్టీ నిర్వాహకుడు, రిసార్ట్ నిర్వాహకుడు, టెస్టుల్లో గంజాయి పాజిటివ్‌గా తేలిన ఒక వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిపై అనుమతి లేకుండా పార్టీ నిర్వహణ, న్యూసెన్స్ కేసులు నమోదయ్యాయి.
"నా బర్త్ డే పార్టీ ఫ్యామిలీ ఫంక్షన్ మాదిరిగా జరుపుకోవాలనే ఉద్దేశంతో మా అమ్మానాన్నల కోరిక మేరకు కుటుంబ సభ్యులు, బంధువులతో ఏర్పాటు చేయడం జరిగింది. అక్కడ మా కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, స్నేహితులు కూడా ఉన్నారు. లిక్కర్, సౌండ్ సిస్టం ఏర్పాటు చేశారు. లిక్కర్‌కు, సౌండ్ సిస్టమ్‌కు అనుమతి తీసుకోవాలనే విషయంపై నాకు అస్సలు అవగాహన లేదు. రిసార్ట్‌లో పార్టీ అనుకోకుండా.. సడన్‌గా ప్లాన్ చేసుకోవడం జరిగింది. నాకు తెలిసి ఉంటే తప్పకుండా అనుమతి తీసుకునే దాన్ని. అనుమతి తీసుకోవాలనే విషయం నాకు ఎవరూ చెప్పలేదు. తెలిసి అయితే.. నేను ఎలాంటి తప్పు చేయలేదు. రిసార్ట్‌లో లోకల్ లిక్కర్ తప్ప ఎలాంటి ఇతర మత్తు పదార్థాలు అక్కడ లేవు.. వాడలేదు. పోలీసులు సెర్చ్ చేసినా ఎలాంటి మత్తు పదార్థాలు దొరకలేదు. గంజాయి తాగినట్టు ఎవరికైతే పాజిటివ్ వచ్చిందో ఆ వ్యక్తి వేరే ఎక్కడో .. ఎప్పుడో తీసుకున్నట్టు తేలిందని పోలీసులే చెప్పారు. దానిపై విచారణ కూడా జరుగుతోంది. మేం కూడా పోలీసులకు సహకరిస్తున్నాం. నాకు తెలిసి ఎందుకు ఇలా చేస్తాను. మా అమ్మా, నాన్నలను దగ్గర పెట్టుకొని ఇలాంటివి ప్రోత్సహిస్తానా? ఒక రోల్ మోడల్‌గా ఉండాలనుకుంటాను కానీ, ఇలాంటివి ఎందుకు చేస్తాను. మీడియా మిత్రులకు నా విన్నపం.. దయచేసి ఆధారాలు లేని అభియోగాలు నాపై మోపొద్దు.. ప్లీజ్" అంటూ మంగ్లీ వీడియో విడుదల చేశారు.

## ఎన్ఎస్‌డీఎల్ రూ.3వేల కోట్ల ఐపీఓ.. దలాల్ స్ట్రీట్‌లో ఎంట్రీ ఎప్పుడంటే?

దేశంలో అతిపెద్ద డిపాజిటరీ సంస్థ ఎన్ఎస్‌డీఎల్ పబ్లిక్ ఇష్యూ జులైలో రానుంది. డిపాజిటరీ సంస్థ నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్ ఐపీఓ) త్వరలోనే పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఆర్థిక, సెక్యూరిటీల మార్కెట్లలో అనేక ఉత్పత్తులు, సేవలు అందిస్తున్న సంస్థ ఇది. దేశీయ స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయ్యేందుకు చాలా కాలం క్రితమే సన్నాహాలు మొదలుపెట్టిన ఈ సంస్థ.. జులైలో దలాల్ స్ట్రీట్‌లో ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైంది. రూ.3,421 కోట్లు సమీకరించేందుకు ఐపీఓకు రానుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

దేశంలో అతిపెద్ద డిపాజిటరీగా ఉన్న ఎన్ఎస్‌డీఎల్ గతేడాది అక్టోబర్‌లోనే మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి అనుమతులు పొందింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా 5.01 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నట్లు సంబంధిత పత్రాల్లో పేర్కొంది. ఇందులో భాగంగా ఎన్ఎస్‌డీఎల్‌లో వాటాదార్లైన ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ వాటాలను తగ్గించుకోనున్నాయి. ఐసీఐసీఐ సెక్యూరిటీస్ లిమిటెడ్, యాక్సిస్ క్యాపిటల్, హెచ్ఎస్‌బీసీ హోల్డింగ్స్, ఐడీబీఐ క్యాపిటల్ సంస్థలు ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.






## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు..
# స్పందించిన కేంద్రం

**రూ.3,000లకు పైగా చేసే పేమెంట్స్‌పై ఛార్జీలు విధించాలని ప్రభుత్వం యోచిస్తోందంటూ వచ్చిన వార్తలను కేంద్రం ఖండించింది.**

యూపీఐ లావాదేవీల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. కిరాణా దుకాణంలో చిన్న వస్తువుల్ని కొనుగోలు చేయాలన్నా యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ తరహా పేమెంట్స్‌పై ఎటువంటి ఛార్జీలు లేవు. అయితే, త్వరలోనే ఈ లావాదేవీలపైనా మర్చంట్ ఛార్జీల ను ప్రవేశపెట్టాలని కేంద్రం యోచిస్తున్నట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వచ్చాయి. దీనిపై కేంద్రం స్పందించింది. అవన్నీ ఊహాగానాలే అంటూ కొట్టి పారేసింది.

అధిక విలువైన డిజిటల్ లావాదేవీలను నిర్వహించేందుకు ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయంటూ పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీంతో వీటికి సహకరించాలనే లక్ష్యంతో ఎండీఆర్ ఛార్జీలను విధించాలని కేంద్రం భావిస్తోందంటూ వార్తలు వచ్చాయి. వ్యాపారుల వార్షిక ఆదాయం ఆధారంగా కాకుండా, లావాదేవీ విలువ ఆధారంగా ఎండీఆర్ విధించేందుకు చర్చలు జరుగుతున్నాయని, యూపీఐ ద్వారా రూ.3,000కు పైబడిన లావాదేవీలపై ఈ ఛార్జీలు విధించే యోచనలో కేంద్రం ఉందనేది ఆ వార్తల సారాంశం. బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు, ఎన్‌పీసీఐ వంటి వాటాదారులతో సంప్రదింపుల అనంతరం ఒకటి లేదా రెండు నెలల్లో యూపీఐ లావాదేవీలపై రుసుము విధించే విషయంపై నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని ఈ ఉదయం వార్తలు వచ్చాయి.

అలాంటిదేమీ లేదంటూ కేంద్రం ఖండించింది. యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ వసూలు చేస్తారంటూ వచ్చిన వార్తలు పూర్తి ఊహాజనితమని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ ప్రచారం తప్పుదారి పట్టించేదిగా ఉందని తెలిపింది. నిరాధారమైన, సంచలనం సృష్టించే ఊహాగానాలు పౌరుల్లో అనవసరమైన అనిశ్చితి, భయాందోళనలకు కారణమవుతాయంటూ ఎక్స్‌లో పేర్కొంది. యూపీఐ ద్వారా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తెలిపింది.

**యూజర్లపై ప్రభావం ఉంటుందా?**

ఒకవేళ ఎండీఆర్ ఛార్జీలు విధిస్తే యూజర్లపై నేరుగా ఎలాంటి ప్రభావం ఉండబోదు. ఈ లావాదేవీల కోసం యూజర్ల నుంచి ఎలాంటి ఛార్జీలూ వసూలు చేయబోరు. మూడేళ్ల ముందు వరకు యూపీఐ ఆధారిత చెల్లింపులను ప్రాసెస్ చేసేందుకు వ్యాపారులు కొంతమొత్తం ఛార్జీలను బ్యాంకులకు కట్టాల్సి వచ్చేది. అది కూడా ఒక శాతం లోపే ఉండేది. అయితే, యూపీఐ చెల్లింపులపై ఈ ఎండీఆర్ ఛార్జీలను 2022లో కేంద్రం తొలగించింది. అనంతరం ఈ ప్రాసెసింగ్ ఖర్చులను భర్తీ చేసేందుకు బ్యాంకులు, ఫిన్‌టెక్ కంపెనీలకు కేంద్రం సబ్సిడీలు ఇస్తూ వస్తోంది.




## కర్వ్‌డ్ డిస్‌ప్లే, ఏఐ ఫీచర్లతో
# వివో నుంచి టీ4 అల్ట్రా

**వివో నుంచి టీ4 అల్ట్రా స్మార్ట్‌ఫోన్ విడుదలైంది. జూన్ 18 నుంచి దీని విక్రయాలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ప్రారంభం కానున్నాయి.**

చైనాకు చెందిన మొబైల్ తయారీ కంపెనీ వివో తన లేటెస్ట్ స్మార్ట్‌ఫోన్ టీ4 అల్ట్రాను దేశీయ మార్కెట్లోకి లాంచ్ చేసింది. 5,500 ఎంఏహెచ్ బ్యాటరీ, వెనకవైపు ట్రిపుల్ కెమెరా సెటప్, 1.5K క్వాడ్ కర్వ్‌డ్ అమోలెడ్ డిస్‌ప్లేతో ఈ ఫోన్ వస్తోంది. గూగుల్ సర్కిల్ టు సెర్చ్‌తో, పలు ఏఐ టూల్స్ ఇందులో ఉన్నాయి. మరి దీని ధర, ఇతర వివరాలు ఇప్పుడు చూసేద్దాం.

**వివో టీ4 అల్ట్రా ఫీచర్లు**

ఈ ఫోన్ 6.67. అంగుళాల 1.5K క్వాడ్ కర్వ్‌డ్ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. ఇది 120Hz రిఫ్రెష్ రేటుతో వస్తోంది. 5000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉంది. హెచ్‌డీఆర్ 10+ స్క్రీన్ సపోర్ట్‌తో పాటు ఎస్‌జీఎస్ లో బ్లూ లైట్ సర్టిఫికేషన్‌తో ఈ ఫోన్ వస్తోంది. మీడియాటెక్ డైమెన్సిటీ 9300+ ప్రాసెసర్‌ను అమర్చారు. ఆండ్రాయిడ్ 15తో కూడిన ఫన్‌టచ్‌ఓఎస్ 15తో పనిచేస్తుంది.

ఇక కెమెరా విషయానికొస్తే.. ఇందులో 50 ఎంపీ సోనీ ఐఎంఎక్స్921 ప్రధాన కెమెరా ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో వస్తోంది. 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా, 50 ఎంపీ సోనీ ఐఎంఎక్స్882 పెరిస్కోప్ లెన్స్ ఇచ్చారు. ముందువైపు 32 ఎంపీ సెల్ఫీ కెమెరాతో వస్తోంది. 5,500 ఎంఏహెచ్ బ్యాటరీ, 90W ఫాస్ట్ చార్జింగ్ సదుపాయం ఉంది. గూగుల్ సర్కిల్ టు సెర్చ్, ఏఐ నోట్ అసిస్ట్, ఏఐ ఎరేజ్, ఏఐ ట్రాన్స్‌స్క్రిప్ట్, ఏఐ కాల్ ట్రాన్స్‌లేషన్ వంటి ఫీచర్లు ఉన్నాయి.

**టీ4 అల్ట్రా ధర ఎంత?**

వివో టీ4 అల్ట్రా మూడు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీ+256జీబీ వేరియంట్ ధర రూ.37,999గా కంపెనీ నిర్ణయించింది. 12జీబీ+256జీబీ వేరియంట్ ధర రూ.39,999, 12జీబీ+512జీబీ వేరియంట్ ధర రూ.41,999గా కంపెనీ పేర్కొంది. మెటోర్ గ్రే, ఫొనిక్స్ గోల్డ్ రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్, వివో ఇండియా ఈస్టోర్, ఎంపిక చేసిన ఆఫ్‌లైన్ స్టోర్ల నుంచి జూన్ 18 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. మూడేళ్ల పాటు ఆండ్రాయిడ్ అప్‌డేట్స్, 4 ఏళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్లు రానున్నాయి.

## 10ని.ల్లో ఆహార డెలివరీలోకి బిగ్‌బాస్కెట్

**'10 నిమిషాల్లో ఆహార డెలివరీ' సేవలను దేశవ్యాప్తంగా ప్రారంభించడానికి టాటా గ్రూప్ సంస్థ బిగ్‌బాస్కెట్ సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) చివరికి ఈ సేవలు ప్రారంభించాలని సంస్థ భావిస్తోంది.**

**18-24 నెలల్లో ఐపీఓకు సన్నాహాలు**

**ఢిల్లీ:** '10 నిమిషాల్లో ఆహార డెలివరీ' సేవలను దేశవ్యాప్తంగా ప్రారంభించడానికి టాటా గ్రూప్ సంస్థ బిగ్‌బాస్కెట్ సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202526) చివరికి ఈ సేవలు ప్రారంభించాలని సంస్థ భావిస్తోంది. తద్వారా స్విగ్గీ 'స్నాక్', బ్లింకిట్ బిస్ట్రో, జెప్టో కేఫ్ వంటి సంస్థలతో బిగ్‌బాస్కెట్ పోటీపడనుంది. ప్రస్తుతం ఈ సంస్థలు 15 నిమిషాల్లోపే కాఫీ, రెడీ టూ ఈట్ స్నాక్స్‌ను డెలివరీ చేస్తున్నాయి.

జొమాటో, స్విగ్గీ వంటి ఆహార డెలివరీ సంస్థల వినియోగదారులతో పాటు, కొత్త వారికీ ఈ తరహా సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని బిగ్‌బాస్కెట్ సహవ్యవస్థాపకుడు విపుల్ పరేఖ్ తెలిపారు. ఈ సేవల కోసం డార్క్ స్టోర్లు (నగరాల్లో చిన్న గోదాముల)ను వినియోగించుకోవాలని చూస్తున్నామన్నారు.

ఆన్‌లైన్‌లో ఆర్డర్ తీసుకుని, నిత్యావసరాలను అందించే సేవలను బిగ్‌బాస్కెట్ 2011లో ప్రారంభించింది. నెలరోజుల క్రితం బెంగళూరులో ప్రయోగాత్మకంగా ఆహార డెలివరీ సేవలకు సంస్థ శ్రీకారం చుట్టింది. టాటా గ్రూప్‌నకు చెందిన కాఫీ సంస్థ స్టార్ బక్స్, ఇండియన్ హోటల్స్ ఆహార విభాగం క్యూమిన్ నుంచి మాత్రమే ప్రస్తుతం డెలివరీలు చేస్తోంది. వచ్చే 1824 నెలల్లో ఐపీఓకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని పరేఖ్ వివరించారు.




## 'తత్కాల్' కొత్త రూల్: ఆధార్ ఓటీపీ ఉంటేనే ట్రైన్ టికెట్లు!

**రైల్ తత్కాల్ టికెట్ బుకింగ్‌కు సంబంధించి రైల్వేశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆధార్ ఓటీపీ ఉంటేనే యూజర్లకు తత్కాల్ బుకింగ్ చేసుకునే అవకాశముంటుందని రైల్వేశాఖ పేర్కొంది.**

**ఢిల్లీ:** రైల్వే తత్కాల్ టికెట్లకు సంబంధించి కేంద్రం కొత్త నిబంధనను తీసుకొచ్చింది. కేవలం ఆధార్ ధ్రువీకరణ ఉన్న వ్యక్తులే జులై 1 నుంచి తత్కాల్ టికెట్లు బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్/ యాప్‌లో ఆధార్ అథంటికేటెడ్ వ్యక్తులకే టికెట్ బుకింగ్ అవకాశం కల్పించాలని రైల్వే శాఖ తన సర్క్యులర్‌లో పేర్కొంది. అలాగే, జులై 15 నుంచి తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు ఆధార్ బేస్డ్ ఓటీపీని తప్పనిసరి చేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు అన్ని జోన్లకు తాజాగా సర్క్యులర్ జారీ చేసింది.

రైల్వే శాఖకు చెందిన టికెట్ బుకింగ్ కౌంటర్లు, అధీకృత ఏజెంట్లు కూడా తత్కాల్ టికెట్లు బుక్ చేయాలంటే వ్యక్తుల మొబైల్‌కు వచ్చే ఆధార్ ఓటీపీని ఎంటర్ చేయాల్సి ఉంటుందని తన సర్క్యులర్‌లో పేర్కొంది. అధీకృత ఏజెంట్లకు తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు తొలి 30 నిమిషాల పాటు అవకాశం ఇవ్వబోమని స్పష్టంచేసింది. అంటే ఏసీ తరగతులకు ఉదయం 10.30 గంటల తర్వాత, నాన్ ఏసీ తరగతులకు ఉదయం 11.30 గంటల తర్వాత మాత్రమే టికెట్ బుకింగ్‌కు వెసులుబాటు కల్పించనున్నారు. ఈ ఆదేశాలకు అనుగుణంగా రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఐఆర్‌సీటీసీ తమ సిస్టమ్స్‌లో మార్పులు చేసుకోవాలని రైల్వే శాఖ సూచించింది. అనధికారిక టికెట్ బుకింగ్‌లను నిలిపివేయడానికి గానూ రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**24 గంటల ముందే వెల్లడి**

ట్రైన్ బయల్దేరడానికి కంటే నాలుగు గంటల ముందు మాత్రమే ప్రస్తుతం వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న టికెట్ల స్టేటస్ తెలుస్తోంది. ఇకపై 24 గంటల ముందే ఆ వివరాలు వెల్లడించేందుకు రైల్వే శాఖ సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా బికనేర్ డివిజన్‌లో పైలట్ ప్రాజెక్ట్ చేపట్టినట్లు రైల్వే బోర్డుకు చెందిన సీనియర్ అధికారి వెల్లడించారు. వెయిటింగ్ లిస్ట్ టికెట్ కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా ప్రయోగాత్మకంగా దీన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు.



# వేడుకగా అవికా గోర్ నిశ్చితార్థం.. ఫొటోలు పంచుకున్న నటి

నటి అవికా గోర్ నిశ్చితార్థం చేసుకున్నారు. సంబంధిత ఫొటోలను ఆమె సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.

'చిన్నారి పెళ్లికూతురు'గా విశేష గుర్తింపు పొందిన నటి అవికా గోర్ .. త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారు. తనకు నిశ్చితార్థం జరిగిందన్న శుభవార్తను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. కాబోయే భర్తను పరిచయం చేశారు. తాను షేర్ చేసిన ఫొటోలో కాబోయే వాడితో సరదాగా ముచ్చటిస్తూ, ముద్దాడుతూ కనిపించారు. "అతడు ప్రపోజ్ చేశాడు. ముందుగా నవ్వే నా సమాధానం. తర్వాత భావోద్వేగానికి గురయ్యా. చివరకు నా సమాధానం 'ఎస్" అని అవికా పేర్కొన్నారు. మనసులో మాట అతడు బయటపెట్టగానే.. తనకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వినిపించిందని, స్లో మోషన్‌లో వేడుక విజువల్స్ కనిపించాయని, గాల్లో తేలినట్టుగా అనిపించిందని అవికా సినిమాటిక్ స్టైల్‌లో చెప్పారు.

**ఎవరీ మిళింద్..?**

అవికాను పెళ్లాడనున్న వ్యక్తి పేరు మిళింద్ చద్వానీ . సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త. క్యాంప్ డైరీస్ పేరిట ఓ ఎన్జీవో నెలకొల్పారు. అంతకుముందు ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేశారు. 2019లో ఓ టీవీలో ప్రసారమైన 'రోడీస్ రియల్ హీరోస్' షోతో బుల్లితెర ప్రేక్షకులను ఆకర్షించారు. కామన్ ఫ్రెండ్స్ ద్వారా కొన్నాళ్ల క్రితం మిళింద్, అవికా మధ్య పరిచయం ఏర్పడింది. తర్వాత స్నేహితులయ్యారు. పెద్దల అంగీకారంతో వివాహ బంధంలోకి అడుగు పెట్టబోతున్నారు. 'ఉయ్యాలా జంపాలా'తో హీరోయిన్‌గా ప్రయాణం మొదలుపెట్టిన అవికా తొలి ప్రయత్నంలోనే విజయం అందుకున్నారు. తర్వాత, 'సినిమా చూపిస్త మావ', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'రాజుగారి గది 3' తదితర చిత్రాలతో ఆకట్టుకున్నారు. ఆమె లేటెస్ట్ మూవీ 'షణ్ముఖ' ఈ ఏడాది మార్చిలో విడుదలైంది.





# నిఖిల్ సినిమా షూటింగ్‌లో ప్రమాదం

హీరో నిఖిల్ సినిమా 'ది ఇండియా హౌస్' షూటింగ్‌లో భారీ ప్రమాదం చోటుచేసుకుంది.

హైదరాబాద్: హీరో నిఖిల్ సినిమా షూటింగ్‌లో ప్రమాదం చోటుచేసుకుంది. శంషాబాద్ సమీపంలో 'ది ఇండియా హౌస్' సినిమా సెట్‌లో ఈ ఘటన జరిగింది. స్విమ్మింగ్ పూల్ చిత్రీకరణలో భాగంగా కట్ట తెగి ఒక్కసారిగా వరద సెట్‌లోకి దూసుకొచ్చింది. దీంతో సెట్‌లో ఉన్న పలువురు సిబ్బందికి స్వల్ప గాయాలు అయ్యాయి.

కథానాయకుడు రామ్‌చరణ్ సమర్పణలో నిఖిల్‌సయీ మంజ్రేకర్ జంటగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రమే 'ది ఇండియా హౌస్'. రామ్ వంశీకృష్ణ తెరకెక్కిస్తున్నారు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ , వి మెగా పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అనుపమ్ ఖేర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. 1905 నేపథ్యంలో ప్రేమ, విప్లవం అంశాలతో నిండి ఉన్న ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం.



# మళ్లీ రెచ్చగొట్టిన రష్మిక.. ఈసారి ఏం చేస్తారో?

రష్మిక స్వతహాగా కన్నడ అమ్మాయి. కానీ ఆ రాష్ట్రానికి చెందిన ప్రేక్షకులే ఈమెని ఎప్పటికప్పుడు విమర్శిస్తుంటారు. దానికి కారణాలు కూడా ఉన్నాయి. గతంలో పలుమార్లు ఈమే మాట్లాడిన మాటలే దీనికి కారణం అని చెప్పొచ్చు. మరి తెలిసి చేసిందో తెలియక చేసిందో గానీ ఇప్పుడు మరోసారి కన్నడని కెలికింది. అసలే కమల్ హాసన్ వల్ల కోపంతో ఉన్నారు. ఇప్పుడు రష్మిక లేటెస్ట్ పోస్ట్ చూసి షాకవుతున్నారు.

రష్మిక నటించిన లేటెస్ట్ మూవీ 'కుబేర'. శేఖర్ కమ్ముల తీసిన ఈ సినిమా జూన్ 20న పాన్ ఇండియా వైడ్ రిలీజ్ కానుంది. ఈ చిత్ర ప్రమోషన్స్ ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. నిన్ననే ముంబైలో ఓ ఈవెంట్ జరగ్గా.. అంతకు ముందు దక్షిణాదిలోనూ జరిగాయి. ఈ క్రమంలోనే రష్మిక తన ఇన్ స్టాలో కొన్ని ఫొటోలు పోస్ట్ చేయడంతో పాటు చెన్నైతో తనకున్న అనుబంధాన్ని షేర్ చేసుకుంది. ఇప్పుడదే కన్నడిగుల ఆగ్రహం తెప్పిస్తోంది.

రష్మిక పోస్ట్‌లో ఏముందంటే.. 'చెన్నైలోనే తన బాల్యం గడిచింది. అందుకే చెన్నైకి నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉంది' అని రాసుకొచ్చింది. అంటే ఓ రకంగా తనది చెన్నై అన్నట్లు చెబుతోంది. ఇది ఇప్పుడు కన్నడిగులకు అసంతృప్తి తెప్పిస్తోంది. ఎందుకంటే రష్మిక పుట్టి పెరిగింది, స్కూల్ చదువుకున్నదంతా కర్ణాటకలోనే. కానీ చెన్నైలో బాల్యం గడపడం ఏంటి అని కన్నడ నెటిజన్లు మాట్లాడుకుంటున్నారు.

గతంలో 'కాంతార' సినిమాని తాను ఇంకా చూడలేదని చెప్పి ట్రోలింగ్‌కి గురైన రష్మిక.. మరో సందర్భంలో హైదరాబాద్ తనకు ఇల్లు లాంటిదని చెప్పి కన్నడిగుల ఆగ్రహానికి గురైంది. ఇప్పుడు మరి ఉద్దేశపూర్వకంగా చేసిందో లేదో తెలీదు గానీ ఈమె పెట్టిన పోస్ట్ సోషల్ మీడియాలో చర్చనీయాంశమవుతోంది.

# పౌడర్ వేసుకున్నానని.. తిట్టారు



మెగా కోడలు లావణ్య త్రిపాఠి నటించిన తొలి తెలుగు సినిమా 'అందాల రాక్షసి'. హను రాఘవపూడి దర్శకత్వ వహించిన ఈ చిత్రంలో నవీన్ చంద్ర, రాహుల్ రవీంద్ర హీరోలుగా నటించారు. వారిద్దరికి కూడా హీరోలుగా ఇదే తొలి సినిమా. 2012లో విడుదలైన ఈ ప్రేమకథా చిత్రం ఎంత సూపర్ హిట్ అయిందో అందరికి తెలిసిందే. సినిమాలోని డైలాగ్స్, పాటలు బాగా వైరల్ అయ్యాయి.

అప్పట్లో సూపర్ హిట్‌గా నిలిచిన ఈ క్లాసిక్ మూవీ ఇప్పుడు మరోసారి థియేటర్స్‌లోకి రాబోతుంది. జూన్ 13న ఈ చిత్రం రీరిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా లావణ్యతో పాటు చిత్రబృందం అంతా మరోసారి సినిమా కోసం ప్రచారం చేస్తున్నారు. ఇంటర్వ్యూల్లో సినిమా షూటింగ్ నాటి అనుభవాలను పంచుకుంటున్నారు.

ఈ సందర్భంగా లావణ్య ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికర విషయాన్ని షేర్ చేసుకుంది. హీరోలతో పాటు తను కూడా మేకప్ లేకుండానే నటించానని చెప్పింది. ఓ సారి అనుకోకుండా ముఖానికి మేకప్ వేసుకొని వస్తే.. దర్శకుడు హను రాఘవపూడి తిట్టాడని చెప్పింది.

'ఈ సినిమా కోసం నేను ఎలాంటి మేకప్ వేసుకోలేదు. రియల్ హెయిర్‌తోనే నటించాను. కనీసం పౌడర్ కూడా వేసుకోలేదు. ఫస్ట్ షెడ్యూల్ షూటింగ్‌లోనే నేను పౌడర్ వేసుకొని సెట్‌కి వచ్చాను. దర్శకుడు హను ఫోటో తీసి నా దగ్గరకు వచ్చి జూమ్ చేసి చూపించాడు. నీ ముఖంపై పౌడర్ పటికలు ఎలా కనిపిస్తున్నాయో చూడు' అన్నారు. వెంటనే నేను ముఖం కడుక్కొని వచ్చాను' అంటూ నాటి షూటింగ్ అనుభవాలను లావణ్య పంచుకున్నారు. ఇక రాహుల్ మాట్లాడుతూ.. జీరో మేకప్‌తో సినిమా చేశాం. కనీసం సన్‌స్క్రీన్ కూడా వాడలేదని చెప్పారు.

# పవన్ కల్యాణ్ సూచనలు.. తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదించాం: దిల్ రాజు

**థియేటర్లలో ధరల నియంత్రణ విషయంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనలను.. తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదించామని నిర్మాత దిల్ రాజు పేర్కొన్నారు.**

**హైదరాబాద్:** థియేటర్లలో ధరల నియంత్రణ విషయంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన సూచనలు ఫాలో అవుతున్నానని నిర్మాత దిల్ రాజు అన్నారు. ఏపీలో థియేటర్లలో ధరల నియంత్రణకు పవన్ తీసుకున్న చర్యల గురించి.. తెలంగాణ మంత్రివర్గ ఉపసంఘం భేటీలో ప్రతిపాదించామని తెలిపారు. ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే బాధ్యత తమపై ఉందని పేర్కొన్నారు. 'తమ్ముడు' సినిమా టికెట్ ధరల పెంపు లేదని తెలిపారు. ఆ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మాట్లాడారు. నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు తెరకెక్కించిన ఈ సినిమా జులై 4న విడుదల కానుంది.

ఏపీలోని థియేటర్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టి, ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించాలని పవన్ కల్యాణ్ కొన్ని రోజుల క్రితం.. సంబంధిత అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. కొత్త చిత్రాల విడుదల సందర్భంలో టికెట్ ధరల పెంపు కోసం నిర్మాతలు, వారికి సంబంధించిన వారు వ్యక్తిగత హోదాలో కాకుండా తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించే విధానాన్ని అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు.

టికెట్ ధరల పెంపు, సినిమా హాళ్ల నిర్వహణ సహా ఏ విషయంలోనైనా ప్రభుత్వ శాఖలు తమ విధులను, పర్యవేక్షణను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. టికెట్ ధర కంటే సినిమా హాల్లో పాప్‌కార్న్ సహా ఇతర తినుబండారాలు, శీతల పానీయాలు, చివరకు మంచి నీళ్ల సీసాల ధరలు సైతం భారీగా ఉండటంపైనా చర్చించారు. ప్రేక్షకులు కుటుంబ సమేతంగా సినిమా హాలుకు రావాలంటే తినుబండారాలు, పానీయాల ధరలు చూసి వెనుకంజ వేసే పరిస్థితి రాకూడదని అభిప్రాయపడ్డారు. ధరలు తగ్గితే ప్రేక్షకుల సంఖ్యా పెరిగి, పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం మెరుగవుతుందన్నారు. ఈ అంశంపై పన్నుల శాఖతో పరిశీలన చేయించాలన్నారు.





## మనూ భాకర్‌కు నిరాశ

**మ్యూనిక్:** ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ వరల్డ్ కప్‌లో రెండో రోజు బుధవారం భారత్ ఒక్క పతకం కూడా గెలుచుకోలేకపోయింది. పారిస్ ఒలింపిక్స్ కాంస్యపతక విజేత మనూ భాకర్, చైన్ సింగ్ తమ విభాగాల్లో ఫైనల్స్‌కు అర్హత సాధించినా మెడల్ మాత్రం దక్కలేదు. మహిళల 25 మీటర్ల పిస్టల్ క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో మనూ 588 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. అయితే అసలు పోరులో ఆమె తడబడింది. ఫైనల్లో 20 పాయింట్లు మాత్రమే సాధించి మూడో ఎలిమినేషన్ రౌండ్‌ను దాటలేకపోయింది.
ఇదే ఈవెంట్‌లో హైదరాబాద్ షూటర్ ఇషా సింగ్ కూడా నిరాశపర్చింది. క్వాలిఫయింగ్‌లో 585 పాయింట్లకే పరిమితమైన 11వ స్థానంలో నిలిచిన ఇషా ఫైనల్‌కు కూడా అర్హత సాధించలేదు. మరో భారత షూటర్ సిమ్రన్‌ప్రీత్ కౌర్ 32వ స్థానంలో నిలిచింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ ఈవెంట్‌లో చైన్ సింగ్ ఏడో స్థానంతో సరిపెట్టుకున్నాడు.
ఇటీవల అర్జెంటీనాలో జరిగిన ప్రపంచ కప్‌లో కాంస్యం గెలిచిన చైన్ సింగ్ క్వాలిఫయింగ్‌లో ఐదో స్థానంలో ఫైనల్‌కు చేరినా పతకం మాత్రం దక్కలేదు. నేడు జరిగే పోటీల్లో భారత షూటర్లు అర్జున్ బబూటా, సందీప్ సింగ్, సిఫ్ట్ కౌర్, శ్రియాంక, ఆషి చౌక్సీ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.



## కాంస్య పతకం గెలిచిన భారత షూటర్ ఇలావేనిల్

అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) మూడో ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత్ కాంస్య పతకంతో ఖాతా తెరిచింది. జర్మనీలోని మ్యూనిక్‌లో మంగళవారం మొదలైన ఈ టోర్నీలో తొలి రోజు భారత్‌కు మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ఇలావేనిల్ వలారివన్ కాంస్య పతకాన్ని అందించింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 25 ఏళ్ల ఇలావేనిల్ 231.2 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. ఓవరాల్‌గా వరల్డ్‌కప్ టోర్నీలలో ఇలావేనిల్‌కిది ఏడో పతకం కావడం విశేషం. వాంగ్ జిఫె (చైనా; 252.7 పాయింట్లు) స్వర్ణ పతకాన్ని దక్కించుకోగా... క్వాన్ యుంజీ (దక్షిణ కొరియా; 252.6 పాయింట్లు) కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫయింగ్‌లో ఇలావేనిల్ 635.9 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. టాప్-8లో నిలిచిన వారికి ఫైనల్ బెర్త్ లభించింది.మరోవైపు పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో భారత షూటర్ వరుణ్ తోమర్ 160.3 పాయింట్లు స్కోరు చేసి ఆరో స్థానంలో నిలిచాడు. భారత ఇతర పిస్టల్ షూటర్లు నిశాంత్ రావత్ 12వ స్థానంలో, అర్జున్ సింగ్ చీమా 20వ స్థానంలో, ఆదిత్య మాల్రా 30వ స్థానంలో నిలిచారు.



## చరిత్ర సృష్టించిన స్మిత్.. 99 ఏళ్ల రికార్డు బద్దలు

లార్డ్స్ వేదికగా సౌతాఫ్రికాతో జరుగుతున్న ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ హాఫ్ సెంచరీతో మెరిశాడు. తొలి ఇన్నింగ్స్‌లో 67 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన ఆసీస్‌ను వెబ్‌స్టర్‌తో కలిసి స్మిత్ ఆదుకున్నాడు. ఆచితూచి ఆడుతూ స్కోర్ బోర్డును ముందుకు నడిపించాడు. 112 బంతుల్లో 10 ఫోర్ల సాయంతో 66 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ క్రమంలో స్మిత్ పలు అరుదైన రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు.

**చరిత్ర సృష్టించిన స్మిత్..**

ఇంగ్లండ్ గడ్డపై టెస్టుల్లో అత్యధిక ఫిఫ్టీ ప్లస్ స్కోర్లు సాధించిన విదేశీ బ్యాటర్‌గా స్మిత్ నిలిచాడు. ఇప్పటివరకు స్మిత్ ఇంగ్లండ్‌లో 18 సార్లు ఏభైకి పైగా పరుగులు చేశాడు. ఇంతకుముందు ఈ రికార్డు ఆస్ట్రేలియా దిగ్గజం అలన్ బోర్డర్ (17) పేరిట ఉండేది. తాజా మ్యాచ్‌తో బోర్డర్ ఆల్‌టైమ్ రికార్డును స్మిత్ బ్రేక్ చేశాడు.

**ఇంగ్లండ్‌లో టెస్టుల్లో అత్యధిక సార్లు ఫిఫ్టీ ప్లస్ స్కోర్లు చేసిన విదేశీ బ్యాటర్లు వీరే..**

**స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా)-18**
**అల్లన్ బోర్డర్ (ఆస్ట్రేలియా)- 17**
**వివ్ రిచర్డ్స్ (వెస్టిండీస్)- 17**
**డాన్ బ్రాడ్‌మాన్ (ఆస్ట్రేలియా)- 14**
**గ్యారీ సోబర్స్ (వెస్టిండీస్)- 14**

అదేవిధంగా ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానంలో టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన విదేశీ బ్యాటర్‌గా స్టీవ్ స్మిత్ చరిత్ర సృష్టించాడు. స్మిత్ ఇప్పటివరకు లార్డ్స్‌లో 591 పరుగులు చేశాడు. ఇంతకుముందు ఈ రికార్డు ఆసీస్ లెజెండ్ వారెన్ బార్డ్స్‌లీ (575 పరుగులు) పేరిట ఉండేది. 19091926 కాలంలో బార్డ్స్‌లీ ఈ ఫీట్ సాధించాడు. తాజా ఇన్నింగ్స్‌తో 99 ఏళ్ల బార్డ్స్‌లీ రికార్డును స్మిత్ బద్దలు కొట్టాడు.

లార్డ్స్‌లో అత్యధిక పరుగులు చేసిన విదేశీ బ్యాటర్లు..

**స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా)- 591**
**వారెన్ బార్డ్స్ (ఆస్ట్రేలియా) - 575**
**గ్యారీఫీల్డ్ సోబర్స్ (వెస్టిండీస్) - 571**
**డాన్ బ్రాడ్‌మన్ (ఆస్ట్రేలియా) - 551**
**శివ్‌నారాయణ్ చందర్‌పాల్ (వెస్టిండీస్) - 512**
**దిలీప్ వెంగ్‌సర్కార్ (భారత్) - 508**
**అలెన్ బోర్డర్ (ఆస్ట్రేలియా) - 503**





# ‘ఫిఫా’ ప్రపంచకప్‌కు బ్రెజిల్ క్వాలిఫై

సావో పాలో: వచ్చే ఏడాది జరగనున్న ప్రతిష్టాత్మక ‘ఫిఫా’ ప్రపంచకప్‌నకు బ్రెజిల్, ఈక్వెడార్, ఆస్ట్రేలియా జట్లు అర్హత సాధించాయి. దక్షిణ అమెరికా అర్హత టోర్నీలో భాగంగా బ్రెజిల్ జట్టు మంగళవారం అర్ధరాత్రి దాటాక జరిగిన మ్యాచ్‌లో 1–0 గోల్ తేడాతో పరాగ్వేపై విజయం సాధించింది. తద్వారా ‘ఫిఫా’ వరల్డ్‌కప్ బెర్తు దక్కించుకుంది. ఇప్పటి వరకు ఐదుసార్లు (1958, 1962, 1970, 1994, 2002లో) చాంపియన్‌గా నిలిచిన బ్రెజిల్ 2022 ప్రపంచకప్‌లో క్వార్టర్‌ఫైనల్లో ఓడింది. మరోవైపు పెరూతో జరిగిన మ్యాచ్‌ను ‘డ్రా’ చేసుకోవడం ద్వారా ఈక్వెడార్ ముందంజ వేసింది. ఇప్పటికే వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించిన డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా, కొలంబియాతో మ్యాచ్‌ను 1–1తో ‘డ్రా’ చేసుకుంది. 2026లో మూడు దేశాలు ఆతిథ్యమిస్తున్న ఫిఫా ప్రపంచకప్‌లో 48 జట్లు పాల్గొననున్నాయి. దక్షిణ అమెరికా అర్హత టోర్నీలో అర్జెంటీనా 35 పాయింట్లతో అగ్ర స్థానంలో ఉండగా... ఈక్వెడార్, బ్రెజిల్ చెరో 25 పాయింట్లతో వరుసగా రెండో, మూడో స్థానాల్లో ఉన్నాయి. దక్షిణ అమెరికా నుంచి వరల్డ్‌కప్‌నకు ఆరు జట్లు నేరుగా అర్హత సాధించనున్నాయి. బొలీవియాతో మ్యాచ్‌లో 0–2తో పరాజయం పాలైన చిలీ జట్టు... వరుసగా మూడోసారి విశ్వ సమరానికి దూరమైంది. మరోవైపు ఆస్ట్రేలియా వరుసగా ఆరో సారి ఫిఫా ప్రపంచకప్ బెర్తు దక్కించుకుంది. 2–1 గోల్స్ తేడాతో సౌదీ అరేబియాపై గెలవడం ద్వారా ఆసీస్ ముందంజ వేసింది.

## రిటైర్మెంట్ ప్రకటించిన మరుసటి రోజే పూరన్‌కు బంపరాఫర్.. కెప్టెన్‌గా ఎంపిక



అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన మరుసటి రోజే విండీస్ విధ్వంసకర యోధుడు నికోలస్ పూరన్‌కు బంపర్ ఆఫర్ వచ్చింది. త్వరలో ప్రారంభం కానున్న మేజర్ లీగ్ క్రికెట్ 2025 సీజన్ కోసం ముంబై ఇండియన్స్ న్యూయార్క్ పూరన్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసింది. ఈ మేరకు సోషల్‌మీడియాలో వేదికగా ఓ ప్రకటన విడుదల చేసింది.
మా హీరో, మా కెప్టెన్, 29 ఏళ్ల పాకెట్ డైనమైట్ ,సూపర్ స్టార్ నికోలస్ పూరన్ కాగ్నిజెంట్ మేజర్ లీగ్ క్రికెట్ 2025 సీజన్‌కు ముందు న్యూయార్క్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ ఎడమ చేతి వాటం వికెట్ కీపర్ బ్యాటర్ ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన బ్యాటర్లలో ఒకరు. ప్రస్తుతం అతని శక్తుల అత్యున్నత స్థాయిలో ఉన్నాయి. అతని నాయకత్వంలో ని అత్యున్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నాడు అని అధికారిక ప్రకటనలో పేర్కొంది.
ఎంఎల్‌సీలో రెండు సీజన్లలో కీరన్ పోలార్డ్ ఎంఐ న్యూయార్క్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ప్రస్తుత సీజన్‌కు పోలార్డ్ అందుబాటులో ఉండే అంశంపై క్లారిటీ లేదు. దీంతో యాజమాన్యం పూరన్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసింది. పోలీ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ కోచ్‌గా ఉన్న విషయం తెలిసిందే. ఎంఎల్‌సీ 2025 రేపటి నుంచి (జూన్ 12) నుంచి జులై 13 వరకు యూఎస్ఏలో జరుగనుంది. ఈ లీగ్‌లో మొత్తం ఆరు జట్లు పాల్గొంటాయి. లాస్ ఏంజెలెస్ నైట్‌రైడర్స్‌కు సునీల్ నరైన్, ఎంఐ న్యూయార్క్‌కు పూరన్, శాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్‌కు కోరె ఆండర్సన్, సియాటిల్ ఒర్కాస్‌కు హెన్రిచ్ క్లాసెన్, టెక్సస్ సూపర్ కింగ్స్‌కు డుప్లెసిస్, వాషింగ్టన్ ఫ్రీడంకు మ్యాక్స్‌వెల్ కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు.
కాగా, ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ సభ్యుడిగా ఉన్న పూరన్ ఎంఎల్‌సీలో ముంబై ఇండియన్స్ సిస్టర్ ఫ్రాంచైజీ అయిన ఎంఐ న్యూయార్క్‌లో ఆరంభ సీజన్ నుంచి (2023) పాల్గొంటున్నాడు. ఎంఎల్‌సీ ఆరంభ ఎడిషన్‌లో పూరన్ ఎంఐ న్యూయార్క్‌ను ఛాంపియన్‌గా నిలబెట్టడంలో కీలకపాత్ర పోషించాడు. ఆ సీజన్‌లో పూరన్ 8 మ్యాచ్‌ల్లో 167.24 స్ట్రయిక్‌రేట్‌తో 388 పరుగులు చేశాడు. ఫైనల్లో పూరన్ విధ్వంసకర శతకం (55 బంతుల్లో 137 నాటౌట్; 10 ఫోర్లు, 13 సిక్సర్లు) చేసి ఒంటిచేత్తో తన జట్టును విజయతీరాలకు చేర్చి టైటిల్‌ను అందించాడు.

**2025 ఎంఎల్‌సీ కోసం ఎంఐ న్యూయార్క్ జట్టు..**

**పూరన్ (కెప్టెన్), పోలార్డ్, ఎహసాన్ ఆదిల్, ట్రెంట్ బౌల్ట్, నోస్తుశ్ కెంజిగే, రషీద్ ఖాన్, మోనాంక్ పటేల్, సన్నీ పటేల్, హీత్ రిచర్డ్స్ , రుషిల్ ఉగార్కర్, అగ్ని చోప్రా, తజిందర్ సింగ్, కన్వర్జిత్ సింగ్, శరద్ లాంబా, జార్జ్ లిండే, క్వింటన్ డికాక్, మైఖేల్ బ్రేస్‌వెల్, నవీన్ ఉల్ హాక్,**



## భారత కెప్టెన్ ఒక సూపర్ స్టార్.. కానీ అతడిని మిస్ అవుతారు: ఓలీ పోప్

**టీమిండియాతో టెస్టు సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ వైస్ కెప్టెన్ ఓలీ పోప్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఈ సిరీస్‌లో మైదానంలో ఎంతో యాక్టివ్‌గా ఉండే విరాట్ కోహ్లి సేవలను భారత్ మిస్ అవుతుందని పోప్ అభిప్రాయపడ్డాడు. అదేవిధంగా ప్రస్తుత భారత జట్టులో యంగ్ టాలెంటెడ్ ఆటగాళ్లు ఉన్నారని అతడు కొనియాడాడు.**



ఇంగ్లండ్ టూర్‌కు ముందు కోహ్లి టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌కు వరకైనా కొనసాగాలని విరాట్‌ను సెలక్టర్లు కోరినప్పటికి అతడు మాత్రం తన మనసును మర్చుకోలేదు. అతడితో పాటు కెప్టెన్ రోహిత్ శర్మ కూడా రెడ్ బాల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికి షాకిచ్చాడు.
దీంతో టీమిండియా టెస్టు జట్టు కొత్త కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్ నియమితుడయ్యాడు. అదేవిధంగా సాయిసుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్ వంటి యువ ఆటగాళ్లు తొలిసారి భారత టెస్టు జట్టులోకి చోటు దక్కగా.. కరుణ్ నాయర్ ఎనిమిదేళ్ల తర్వాత పునరాగమనం చేశాడు. ఇప్పటికే ఇంగ్లండ్‌పై గడ్డపై అడుగు పెట్టిన భారత జట్టు.. ప్రాక్టీస్‌లో మునిగితేలుతోంది. ఇంగ్లండ్ వంటి కఠిన పరిస్థితుల్లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలోని యంగ్ టీమిండియా ఎలా రాణిస్తుందో అందరూ ఆతృతగా ఎదురు చూస్తోంది.
ఈ నేపథ్యంలో ఓలీ పోప్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "ఇది యువ భారత జట్టు. కానీ ఈ జట్టులో అద్భుతమైన ఆటగాళ్లు ఉన్నారు. చాలా మందికి కౌంటీల్లో ఆడిన అనుభవం కూడా ఉంది. అదేవిధంగా కొత్త కెప్టెన్ శుబ్‌మన్ గిల్ టాలెంట్ కోసం మనందరికీ తెలుసు.
అతడొక సూపర్ స్టార్. అయితే స్లిప్‌లో నిలబడి ప్రత్యర్థి బ్యాటర్లను ఏకగ్రాతను కోల్పోయేలా చేసే విరాట్ కోహ్లి సేవలను మాత్రం భారత్ కోల్పోతుంది. అయినప్పటికీ భారత జట్టు అన్ని విభాగాల్లో సమతూకంగా ఉంది. వారిని ఎదుర్కొనేందుకు మా ఆటగాళ్లు కూడా సిద్ధంగా ఉన్నారు అని చెప్పుకొచ్చాడు. కాగా ఈ సిరీస్‌లో తొలి టెస్టు జూన్ 20 నుంచి 24 వరకు లీడ్స్ వేదికగా జరగనుంది.

# ఆస్ట్రేలియా మీడియాకు అంత ‘కంగారూ’ ఎందుకో?!

**ఆసీస్ జట్టుకు లార్డ్స్ మైదానంలో ప్రాక్టీస్ కోసం అనుమతి లభించలేదు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియన్ మీడియా టీమ్‌ఇండియాపై తన అక్కసు వెల్లగక్కింది.**

భారత్ , ఇంగ్లండ్ మధ్య అయిదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ జూన్ 20 నుంచి ప్రారంభం కానుంది. అలాగే నేడు (బుధవారం) లార్డ్స్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ పోరు జరగనుంది. అయితే కొన్నిరోజుల క్రితం ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు లార్డ్స్ మైదానంలో ప్రాక్టీస్ కోసం అనుమతి లభించలేదు. దీనికి గల కచ్చితమైన కారణం ఏంటో తెలియనప్పటికీ.. ఇంగ్లండ్ టూర్‌లో ఉన్న భారత జట్టు కూడా అదే మైదానంలో ముందునుంచే ప్రాక్టీస్ సెషన్‌లో ఉందని తెలుస్తోంది.
నిర్వాహకుల సమాచార లోపంతో కంగారూ జట్టుకు ఇబ్బంది తలెత్తితే.. ఆస్ట్రేలియన్ మీడియా మాత్రం టీమ్‌ఇండియాపై తమ అక్కసు వెల్లగక్కింది. తమ టీమ్‌కు లార్డ్స్‌లో ప్రవేశం లభించకపోవడానికి ముమ్మాటికీ భారతజట్టే కారణమంటూ నిరాధార ఆరోపణలు చేసింది. ‘ఆస్ట్రేలియా జట్టు ఖర్చుతో టీమ్‌ఇండియా లార్డ్స్‌లో ప్రాక్టీస్ చేస్తోంది’ అంటూ విద్వేషపూరిత కథనాలు ప్రచురించింది. అయితే, కంగారూ జట్టుకు మొదట అనుమతి లభించనప్పటికీ ఆదివారం నుంచే లార్డ్స్ మైదానంలో ఆసీస్ ఆటగాళ్లు ప్రాక్టీస్ చేసుకోగలిగారు.‘ఈ ఉదయం స్టేడియం ఉత్తమ వెర్షన్ ఇదే అని నేను భావిస్తున్నాను. చుట్టూ ఎవరూ లేరు. ఇది చాలా బాగుంది. ఈసారి నాగరికంగా సాగుతుందని నేను కచ్చితంగా అనుకుంటున్నాను’ అని ఆసీస్ కెప్టెన్ కమ్మిన్స్ సైతం వివక్షాపూరిత వ్యాఖ్యలు చేశాడు. అలాగే అతడు ఇంగ్లండ్ టీమ్‌ను టార్గెట్ చేస్తూ కూడా మాట్లాడాడు. ‘గతంలో యాషెస్ సిరీస్ మధ్యలో పరిస్థితులు చాలా వేడెక్కాయి. వారిలో చాలామంది పాఠం నేర్చుకుని ఉంటారని నేను భావిస్తున్నాను. ఈసారి వారు చాలా మర్యాదగా ఉంటారని నేను కచ్చితంగా అనుకుంటున్నాను’ అని కమ్మిన్స్ అన్నాడు.

